# అంగారతల్పం

శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య

బస్సు కదిలి ముందుకు వెళ్లిపోయింది.

చేయి వూపి స్నేహితుడికి వీడ్కోలు చెబుతూ అలాగే కొన్ని క్షణాలు నిలబడిపోయాను.

అంతలోనే మనసు బరువెక్కి కళ్లలోకి నీటిపొర ఉబికి వచ్చినట్టయింది. ఏమీతోచని వాడిలా ఒక్క నిముషం అటూ ఇటూ చూచి, తర్వాత జనాన్ని తప్పించుకుంటూ యివతలికివచ్చి నడవటం ప్రారంభించాను. ఉన్నట్టుండి ఒక్కసారిగా భయంకరమైన ఒంటరితనం నన్ను లొంగ దీసుకున్నట్టు అనిపించింది. ఆలోచనలోపడినడుస్తూవుంటే లోతైన సముద్రాలలో అడుగున నివసించే ఎనిమిది చేతుల 'ఆక్టోపస్' గుర్తుకు వచ్చింది. ఇంత సమ్మర్దమైన నగరంలోనూ ఈ ఒంటరితనం నన్ను నిర్దాక్షిణ్యంగా 'ఆక్టోపస్'లా కబళించివేస్తున్నది. దానితో శక్తివంచన లేకుండా పోరాడుతూనే ఉన్నాను. అయినా విజయం సిద్ధించడం లేదు సరికదా, ఆ పోరాటంలో క్షణ క్షణానికీ వివశుడనై పోతున్నాను.

జనంతో నిండిన పేవ్‌మెంట్‌మీద ముందుకు సాగిపోతూ వుండగా మళ్లీ అదే దృశ్యం.....అవే ప్రశ్నలు.....అవే సమాధానాలూ.....

—స్వింగ్‌డోరు మూసివున్నది. లోపల డాక్టరు వాష్‌బేసిన్ దగ్గర చేతులు తుడుచుకుంటూ నిలబడివున్నాడు. ప్రక్కనే నా మిత్రుడు—అత డిప్పు డీ రాష్ట్రంలోనే లేడు—ఆందోళన స్ఫుటంగా వినిపించే గొంతుకను తగ్గించి అడిగాడు. "ఎంత కాలం గడుస్తుందంటారు డాక్టర్?"

డాక్టరునుంచి ఏ సమాధానమూ వినిపించలేదు. ఆయన బహుశా భుజాలెగరవేసివుంటాడు.

"ఎన్ని సంవత్సరాలు? చెప్పండి డాక్టర్....." మిత్రుడి ప్రశ్న.

డాక్టరు మళ్లీ ఏ సమాధానమూ చెప్పలేదు.

"పోనీ ఎన్ని నెలలు? అదైనా చెప్పండి......" మళ్లీ మిత్రుడి ప్రశ్న. అతనికంఠంలో ఆత్రుత ధ్వనించింది.

ఈసారి డాక్టరు కంఠస్వరం చాలా నెమ్మదిగా వినిపించింది... "అవును......సంవత్సరాలుకాదు. నెలలే......అదీ సరిగ్గా చెప్పలేను. బహుశా మూడు నాలుగు నెలలు.......ఎవరన్నా కావలసిన వారుంటే తెలియజెయ్యండి. కాని ఒకటిమాత్రం చెప్పగలను. చివరిరోజువరకు అతడు మంచానపడే ప్రమాదంమాత్రంఉండదు".

నా మిత్రుడు గొణుక్కున్నాడు. "ఎవరున్నారతనికి? ఈ లోకంలో 'నా' అనుకోదగ్గ వారెవరూ లేరు."

డాక్టరు యివతలికి రాబోతున్నందువల్ల అంతవరకూ ఆ గుమ్మం ప్రక్కనే నిలబడి వారి మాటలు వింటున్న నేను త్వర త్వరగా వెళ్లిదూరంగావున్న బల్లమీద కూర్చున్నాను. ఆ యిద్దరూ యివతలికి వచ్చారు. డాక్టరు ముక్కుమీదికి జారుతున్న కళ్లజోడు సర్దుకుంటూ నా వంక చూసి, "కంగారు పడనక్కరలేదు. త్వరలో అంతా సర్దుకుంటుంది. రెండు రోజుల కొకసారివచ్చి మందు తీసుకుపోతూ ఉండండి" అన్నాడు.

నేను నవ్వు ఆపుకున్నాను. "అవును..... త్వరలో అంతా సర్దుకుంటుంది!" అనుకున్నాను. అంతలో కొంచెంగా దగ్గు వచ్చింది. రుమాలు నోటికి అడ్డం పెట్టుకుని దగ్గు ఆపుకున్నాను.

—'నెమ్మదిగా, చూసి నడవండి సార్' అన్న మర్యాదతో కూడిన మందలింపుతో ఈ లోకంలోకి వచ్చాను. ఆలోచనలోపడి నడుస్తూ ఆ వ్యక్తిని 'ఢీ' కొన్నందుకు వెనుదిరిగి చూపులతోనే క్షమాపణ చెప్పుకుని మళ్లీ ముందుకు సాగిపోయి 'క్యూ'లో నిలబడ్డాను.

సాయంకాలం నాలుగు గంటలు దాటింది. చాలా సేపటి నుంచి బస్సు రాలేదులా వుంది. 'క్యూ' హనుమంతుడి వాలంవలె మెలికలు తిరిగివుంది.

అదేమి చిత్రమోమరి, నా కెన్నడూ పెద్ద 'క్యూ'లో నిలబడవలసిన అవసరం లేకుండా బస్సు దొరకదు. రూమునుంచి ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడూ, తిరిగి సాయంకాలం రూముకు వచ్చేటప్పుడూ నా కెన్నడూ సజావుగా బస్సు అందదు. పెద్ద 'క్యూ'లో చివరగా నిలబడవలసిన అవసరం వచ్చినందుకు నేనంతగా బాధపడను. కాని ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడు మనసులో కొంచెం బెరుకుగానే ఉంటుంది. అందుకు కారణం కూడా వుంది. ఒక్క నిముషం ఆలస్యంగానైనాసరే నా సీటువైపు వెడుతున్న నన్నుచూసి మా హెడ్ గుమాస్తా—పంచె లోపలికిదోపి బెల్టు పెట్టుకుని పైన కోటు ధరించే ఒక భారీ వ్యక్తి గంభీరంగా

నా వంకా, గోడ గడియారం వంకా చూస్తూ సాభిప్రాయంగా తల పంకిస్తాడు. ఆలస్యంగా వచ్చినందుకు నన్ను కొంచెం కోప్పడినా నే నాట్టే బాధపడను. ఆ తల పంకించడమూ, గడియారం వంకా, నా వంకా మార్చి మార్చి చూడటమూ నాకు మరింత బాధ కలిగిస్తాయి. రెండేళ్ల క్రిందట ఉద్యోగంలో చేరిన కొత్తలో కాబోలు ఒకసారి నేను అరగంట ఆలస్యంగా ఆఫీసుకు వెళ్లాను. అప్పటికి నాకు నే నెక్కవలసిన బస్సు నెంబర్లు కూడా సరిగా తెలియవు మరి....వారి నడిగీ, వీరి నడిగీ, నే నడిగినది వారి కర్థమై, వారు చెప్పినది నే నర్థం చేసుకుని, ఆ బస్సుకోసం పడిగాపులు పడివుండి ఎక్కివచ్చేసరికి ఆలస్యం అయింది. అప్పుడు నా సీటు దగ్గరికి పోబోతున్న నన్ను చూపుడువేలుకదిపి దగ్గరికి రమ్మని సైగ చేశాడు. వెళ్లాను. గడియారంవంక చూశాడు. నేను తలవంచుకుని, "అవును.....బస్సు ఆలస్యమయింది. అందు వల్ల......" అంటున్నాను. ఆయన అప్పుడు తన ముందున్న ఫైలు మూసి, ఒక పక్కగా పడేసి, తల వూపి,

"ఆ కారణాలు అందరూ చెప్పగలరు. అంతగా అయితే మరోగంట ముందుగా బయలుదేరాలి. లేకపోతే మరో ట్రాన్స్ పోర్ట్ ఫెసిలిటీ చూసుకోవాలి. ఆలస్యంగా మాత్రం రాకూడదు. అంతే....." అన్నాడు. "అంతే" అనడం చాలా గొప్పగా, శాసించే ధోరణిలో అన్నాడు. ఇప్పటికీ ఆ మనిషి ఏమీమారలేదు. అలాగే కుర్చీకి నిండుగా కూర్చుని అందర్నీ చూపులతో వేధిస్తూ వుంటాడు. ప్రక్కవాడితో మాట్లాడేందుకు భయం...... పని ఏమీ లేకపోతే 'ఈజీ'గా కాళ్ళు బల్లక్రిందికి జాపుకుని కుర్చీకి ఆనుకుని కూర్చునేందుకు భయం.....ఆలస్యంగా వెళ్లేందుకు భయం........ఒక్క నిముషం ముందుగా సీటునుంచి కదిలేందుకు భయం........

—'హలో' అన్న పలకరింపుతోబాటు భుజంమీద చెయ్యి పడింది. వెనుదిరిగి చూసేసరికి రామమూర్తి కనిపించాడు. అతన్ని చూసి నవ్వి "బస్సుకోసం....." అన్నాను. అతడు చేతిలో సంచీతో ఏవో వస్తువులకోసం బయలుదేరాడులావుంది.

"మీరు రేపు కూడా సెలవు పెట్టారా?" అని అడిగాడు.

నేను తల అడ్డంగా వూపి 'లేదన్నాను.'

"వచ్చే ఆదివారం అందరం పిక్నిక్ ఏర్పాటు చేసుకున్నాం. సరదాగా నలుగురం కలిసి ఒక రోజంతా గడిపివద్దాం. నువ్వు 'ఆబ్సెంట్' అయితే వూరుకునేదిలేదు. నీ పాట ప్రోగ్రాంలో మొదటి అయిటం" అన్నా డతడు మళ్లీ నవ్వుతూ.

తల వూపానేగాని హృదయంలో శల్యం కదిలినట్టయింది. ఇంకెక్కడి పాట! ఇక పాడగలనా నేను?

"మా ఆవిడ సరుకు లేవో తెమ్మని లిస్టు యిచ్చింది. త్వరగా వెళ్లాలి....." అంటూ రామమూర్తి ముందుకు వెళ్లిపోయాడు.

'క్యూ'లో కలవరం బయలుదేరింది. బస్సు ఆకలిగొన్న రాక్షసుడిలా వచ్చి క్యూలో కొంతమందిని దిగ్రమింగి వెళ్లిపోయింది. మిగిలినవారు మళ్లీ యథా ప్రకారం సర్దుకు నిలబడి దిక్కులు చూస్తూ వుండిపోయారు. నాకు ఉదయం ఆఫీసుకు వెళ్లే టప్పుడు కొంత ఆదుర్దాగా ఉంటుందన్నానా? సాయంకాలం పూట మాత్రం అదేమీలేదు. హాయిగా శరీరభారం యావత్తూ ఒక కాలిమీదనే మోపి నిలబడి రెండు చేతులూ గుండెలమీద కట్టుకుని గంటల తరబడి నిలబడగలను. "బస్సు ఎంత ఆలస్యంగా వస్తేనేం? రూముకు వెళ్లి చేసేదిమాత్రం ఏముంది గనుక?" అనిపిస్తుంది. అప్పుడప్పుడు నేను తప్పుకుని తొందర పడే నా వెనక వారికి దోవ యిచ్చి కొన్ని 'థ్యాంక్స్' కూడా పొందాను. ఇవాళ నాకంటె ముందు'క్యూ'లో నిలబడి మాటిమాటికీ తన బుల్లి చేతి వాచీ చూసుకుంటున్న ఆ పదహారేళ్ల చిన్న దానికి అలా నాలు గైదుసార్లు సహాయంచేసి ఆమె కృతజ్ఞత సంపాయించాను. అలా 'క్యూ'లో సోమరిగా నిలబడి చూస్తూవుంటే ఎదురగా హొటల్లో కౌంటర్‌ముందు కూర్చునివుండే బట్టతల వ్యక్తి కనిపిస్తాడు నాకు. నే నతన్ని ఎంతో కాలంగా పరిశీలించాను. బిల్లులు అందుకోవడం....డబ్బు లోపల వేసుకోవడం....చిల్ల రను ఎదురుగావున్న అద్దం బిగించబడిన కౌంటర్‌మీదికి ఒదలడం అతని పని.....ఆ పని ఎంత సునాయాసంగా వేగంగా చేస్తాడో తలుచుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది నాకు. అప్పుడప్పుడు ప్రక్కన నిలబడిన వారితో మాట్లాడుతూనే మెరుపులాగా పని చేస్తా డతడు.....ఆ ప్రక్కనే ఒక స్టేషనరీ స్టోర్సు వుంది. అందులో ఒక నల్లని, మెల్లకన్ను వ్యక్తి కూర్చుని వుంటాడు. అతని కెప్పుడూ బేరం ఉండదు. సోమరిగా కూర్చుని పేపరు తిరగవేస్తూ రోడ్డుమీదికి చూస్తూ ఆవులిస్తూ వుంటాడు. ఆ కొట్లో ఒక ఫోను ఉంది. ఆతడు ఫోనులో మాట్లాడుతూ వుండగానేనెప్పుడూ చూడలేదు. అది కూడా అతనిలాగే సోమరిగా పడి ఉంటుం దక్కడ.

వరుసగా రెండు బస్సులు వచ్చాయి. ముందు వచ్చిన బస్సు కండక్టరు చేయి వూపుతూ "జాగానై.. జాగానై.." అని అరుస్తూ వుండగా ఆబస్సు ఆగకుండానే వెళ్లిపోయింది. రెండో బస్సులో బుల్లి చేతివాచీ చూసుకునే అమ్మాయితో పాటు మరో నలుగురు వ్యక్తులు ఎక్కగానే అదికూడా కదిలిపోయింది. నేను చిల్లరపైసలు చేతిలో వుంచుకుని అలాగే నిలబడిపోయాను. గడిచిన రెండురోజులూ గుర్తు వచ్చాయి. మధుసూదనం ఏదో పని మీద వచ్చాడిక్కడికి. నిజానికి ఆపని వాడు వచ్చిన కొద్ది గంటలలోనే అయిపోయింది. వెంటనే వెళ్లిపోతానన్నాడు. నేను 'అలా కాద'న్నాను. "కనీసం రెండురోజులు యిక్కడ వుండి నాతో గడిపిపో... మళ్లీ అసలు కలుసుకుంటామో లేదో" అన్నాను.

వాడు ఆశ్చర్యపోయి "అదేమిట్రా? అలా అవాచ్యాలు పలుకు తావేమిటి?" అన్నాడు నొచ్చుకుంటూ.

నేను నేలచూపులు చూస్తూ "నాకేమిటో దిగులుగా వుందిరా..." అన్నాను. అవును. ఆమాట అన్నాను. అప్పుడు నాకళ్లు నీళ్లతో నిండినట్టనిపించింది.

వాడు నాభుజం తట్టి "ఛ! అదేమిటిరా అలా డీలాపడి పోతావెందుకు? పోనీ, వుంటాన్లే..." అని కొంచెం సేపాగి "అసలు నీ బాధ నాకు తెలుసులే. ఈ ఒంటరి జీవితానికి స్వస్తి చెబితేగాని నువ్వు బాగుపడవు. నిక్షేపంలా పెళ్లి చేసుకో. నువ్వు 'సరే' నంటే చాలు నా ఎరికలో ఎవరినైనా చూసి ముడిపెట్టేస్తాను" అన్నాడు. నేనప్పుడేమీ బదులు పలకలేదు.

ఆతర్వాత రెండురోజులూ ఎలా గడిచిపోయాయో తలుచుకుంటే చాలు, ఆనందంతో తల మున్కలై పోతున్నాను. భయంకరమైన నా ఒంటరితనమూ, దాన్ని సహస్రాధికం చేసి నన్ను బాధపెట్టే నాగదీ, గదిలో కిటికీ మూలగా గూడుఅల్లుకుని కాపురం వుంటూ లారీ హెడ్‌లైట్ల వంటి కళ్లతో మిర్రిమిర్రి చూస్తూ పొరపాటున దోవ తప్పి వచ్చి గూటిలో యిరుక్కున్న చిన్నచిన్న పురుగులను పట్టితినే బలమైన సాలీడూ, పది గంట లయితే చాలు చుక్కనీళ్లు కూడా రానివంపూ, నన్నెప్పుడూ అకారణ కోపంతో గుడ్లు పెద్దవి చేసుకుని చూసే క్రింది భాగం లోని హిందూస్తానీ మధ్యవయస్సు వ్యక్తీ (నేను రూములో పడుకుని ఒంటరిగా పాడుకుంటూ వుండటం అతనికి నచ్చదు. వయసులో వున్న ఆడపిల్ల తండ్రికదా మరి.) మా ఆఫీసూ, హెడ్‌గుమాస్తా చూపులూ, బస్సులకోసంపడిగాపులు పడివుండటం, రొటీన్ గానుగెద్దు జీవితం, తలనొప్పి పుట్టించే అర్థంపర్థం లేని ఆఫీసు కరెస్పాండెన్సూ, బారెడు పొడుగున వుండే అంకెలూ, రుచీపచీలేని హోటల్ భోజనం...అన్నీ మరిచిపోయాను. ఒకసారి నిద్రసరిగా పట్టక బాధపడుతున్న రోజులలో ఒక స్నేహితుడి సలహా మీద ఏదో టాబ్లెట్ మింగి పడుకున్నాను. ఆ రోజు మంచి నిద్ర పట్టింది. అందులో ఒక్కటంటే ఒక్కటే అందమైన పంచరంగుల కల వచ్చింది. ఇన్నాళ్ల తర్వాత ఆ కల గుర్తులేదు గాని, యీ రెండురోజులూ అంత హాయిగా, ఆనందంగా గడిచి పోయాయి.

మధుసూదనం చాలా మారిపోయాడు. చిన్నతనంలో వాడు ఎంత అల్లరి చేసేవాడు! చదువు మీదా, పుస్తకాల మీదా బొత్తిగా శ్రద్ధ వుండేదికాదు వాడికి. చొక్కాచేతులు పైకి మడుచుకుని, తలసరిగా దువ్వుకోకుండా ఎప్పుడూ రౌడీపోజులో వుండేవాడు. చేతిలోఒక 'రఫ్' నోట్‌బుక్ తప్ప మరేమీ వుండేది కాదు. కాలేజీలో చేరిన తర్వాత కూడా అంతే. ఎప్పుడూ ఏదో ఒక మిష మీద లెక్చరర్లతో పోట్లాట పెట్టుకుని హక్కులు, స్వాతంత్ర్యం అంటూ అరుస్తూ వుండేవాడు. ఇప్పుడు ఎంత తెలివిగా, జాగ్రత్తగా మాట్లాడటం నేర్చాడు! అతన్నిప్పుడు చూసిన వారెవరూ గౌరవించకుండా వుండరు. అంత మర్యాదా మన్ననా ఆ రౌడీకి ఎలా అలవడ్డాయో మరి!

బస్సు రాగానే మళ్లీ 'క్యూ'లో కలవరం బయలుదేరింది. కండక్టరు ఒక్కొక్కళ్లనే లెక్కపెడుతూ బస్సులో ఎక్కిస్తు న్నాడు. నేను కూడా బస్సులో ఎక్కిన తర్వాత మరొక నలుగు రయిదుగురు మాత్రమే క్యూలో నిలబడిపోయారు. ఒక కుచ్చు టోపీ, లాంగ్ కోటు,ధరించిన వ్యక్తి 'త్వరగా వెళ్లాల'ని ప్రాధేయ పడుతూ వుంటే కండక్టరు "మూవ్ కీజీయే.." అంటూ బెల్ యిచ్చాడు. నేను చోటు చూసుకుని కూర్చున్నాను. కిటికీలో నుంచి వరసగా వెనక్కు కదిలిపోయే కొట్లనూ, హోటళ్లనూ, షో రూములనూ చూస్తూ కూర్చుంటే నాకెందుకో రైలు ప్రయాణం గుర్తుకు వచ్చింది. రైల్లో ఎప్పుడూ కిటికీ ప్రక్కనే బయటికి చూస్తూ కూర్చోడం అంటే నాకు ఎంతో యిష్టం. మధ్యసీటు ఎందుకూ పనికిరాని ముసలివారికీ పసిపిల్లలకూ మాత్రమేనని నా ఉద్దేశం. ఈ ఉద్యోగంలో చేరేందుకు వచ్చే టప్పుడు నాకు రైలుపొడుగునా ఎన్నిసార్లు తిరిగినప్పటికీ కిటికీ పక్క సీటు దొరకలేదు. "చేస్తున్నది దూరప్రయాణం కదా, ఈలోపల ఎవరన్నా దిగిపోతార్లే..." అనే ఆశాభావంతో చాలాసేపు నిలబడ్డాను.తర్వాత ఎప్పుడో మధ్యసీటులోకొంచెం ఖాళీ దొరికితే అక్కడ కూర్చున్నాను. అప్పటినుంచీ నేను దిగిపోయేవరకూ అదేమి చిత్రమో, కిటికీ పక్కసీటులో ఒక్కడు కూడా కదల లేదు, మెదలలేదు... కిటికీ పక్కనే హాయిగా కూర్చుని చేతిని గడ్డం క్రింద ఆనించుకుని బయట వేగంగా కదిలిపోయే చెట్లూ చేమలనూ, టెలిగ్రాఫ్ స్తంభాలనూ, పంటపొలాలనూ, పల్లెటీలు కొడుతూ ఎగురుతూ వుండే రకరకాల పక్షులనూ, చూస్తూ వుంటే కలిగే సుఖం మరెందులోనూ ఉండదనిపిస్తుంది. నేను చేసిన కొద్ది రైలుప్రయాణాలలో నేను కనిపెట్టిన విశేషం ఒకటి వుంది. రైలు కట్ట పక్కనే వున్న చెట్లూ టెలిగ్రాఫ్ స్తంభాలూ వెనక్కు కదిలిపోతున్నట్టు కనిపిస్తాయి. అయితే బాగా దూరంగా వుండే చెట్ల తోపులూ, రాళ్లగుట్టలూ, మనతోపాటు మన వెంటనే వస్తున్నట్టు అనిపిస్తుంది. నేనీ విషయం కొత్తగా కనిపెట్టినవాడిలా ఒక మిత్రుడికి చెప్పగా అతడు చప్పరించి "అది ఎవరికి తెలియదేం? దాన్ని సైన్సులో 'పేరలాక్స్' అంటారు" అన్నాడు.

బస్సులో నాముందు సీటులో కూర్చున్న వృద్ధురాలు "బస్సు ఎంతకీ త్వరగా నడవదేం?" అని విసుక్కుంటున్నది. అప్రక్కనే ఎవరో అది సహించలేక "ఎందుకమ్మా, అంత తొందర?బస్సు నడుస్తున్నది కదా! అంత అవసరమైతే టాక్సీలో వెళ్ళలేకపోయావా?" అన్నారు.

ఆమె నెమ్మదిగా బాధగా "అదికాదు బాబూ, మాఅబ్బాయి ఒక ఫౌండ్రీలో పని చేస్తున్నాడు. వాడు వొట్టి జులాయి. డబ్బు కళ్లబడితే పెళ్లాంపిల్లలూ తల్లీ ఏమీ అక్కర్లేదు వాడికి. జూద మాడి, తాగి అంత డబ్బూ తగలేస్తాడు. ఇవాళ జీతాలిస్తారు. నేను ముందుగా వెళ్లి కనబడితే అంతకు తెగించడు. ఆ డబ్బు కాస్త చేజిక్కించుకోకపోతే ఈ నెలరోజులూ నేనూ కోడలూ పిల్లలూ పస్తులుండక తప్పదు" అన్నది నావైపు చూస్తూ తనలో తాను గొణుక్కుంటున్నట్టు.

నా ఎడమచేతి వైపు కూర్చుని వున్న ఆంగ్లోఇండియన్ అమ్మాయి చాలా అందంగా వుంది. ఆమె ఎక్కడో టైపిస్టుగా పని చేస్తున్నదని నాఉద్దేశం. అలా నాకెందు కనిపించిందో నాకు స్పష్టంగా తెలియదు. కాని ఆమె చేతివ్రేళ్లు చూస్తే నాకు

అలా అనిపించింది. అవ్రేళ్లు పొడుగ్గా, నాజూగ్గా అందంగా వున్నాయి.

బస్సు ఆగగానే నేను దిగి రూము వైపు నడవటం ప్రారంభించాను. ఎప్పుడూ బస్సు దిగగానే రూము వైపు నడుస్తూ అడుగులు లెక్కపెడుతూ వుంటాను నేను. సింహద్వారం దాకా మొత్తం నూట ఎనభై మొదలు రెండువందల అడుగులు పడతాయి. సింహద్వారం నుంచీ మేడ మెట్ల దాకా ఇరవై అడుగులు. ఆతర్వాత మొత్తం నేనెక్కవలసిన మెట్లు నలభై. ఆఖరి మెట్టు నుంచి మళ్లీ మూడు అడుగులు వేస్తే రూము గుమ్మం ప్రక్కనే నిలబడి వుంటాను. ఆగది, మేడ మీద ఎడమ వైపు చివరగా వుంటుంది. ఎప్పుడూ గాలి విసురుగా వీస్తూనే వుంటుంది. మా ఆఫీసులో ఒక గుమాస్తా వున్నాడు. ఆయన కనిపించిన ప్రతివారితోనూ మాట్లాడేందుకు మరే విషయమూ లేనట్టు ఎప్పుడూ "మేము అద్దెకుంటున్న పోర్షనులో బొత్తిగా గాలిలేక చచ్చిపోతున్నామండీ. ఎలా గెటాన్ కావడమో అర్థం కావడంలేదు" అంటూ వుంటాడు.

రోడ్డు మీద మొత్తం వంద అడుగులు నడిచానో లేదో నా ఎదురుగా మోటారు సైకిల్ ఆగింది. తలఎత్తి చూసేసరికి మనోహరం కనిపించాడు. ఒక కాలు రోడ్డు మీద వుంచి "ఈమధ్య కనిపించడం లేదేం?" అని ప్రశ్నించి గాగుల్స్ తీసి సిల్కు జేబు రుమాలుతో తుడుచుకుంటూ నావంక చూసి నవ్వాడు. అతను కనిపించినందుకు నేను చాలా సంతోషించాను. "నువ్వే నాకు కనిపించడంలేదు. నాదేముందీ? తెల్లవారితే ఆఫీసూ, పొద్దుగూకితే నా రూమూ, మరెక్కడికీ పోను నేను...." అన్నాను. అతడు నవ్వుతూ "నాకు తీరిక ఉండదోయ్! ఇరవైనాలుగ్గంటలూ బిజీ...." అన్నాడు.

నేను ఒక్కక్షణం ఆగి అనుమానిస్తూనే "మా రూము ఇక్కడికి దగ్గరే .... ఒక్కసారి రాగూడదూ? కాస్సేపు కూర్చుని సరదాగా గడిపినట్టు ఉంటుంది" అన్నాను.

అతడు వాచీ చూసుకుని "మరోసారి వస్తాన్లే .... ఇప్పుడు చచ్చేంత పని ఉంది. మరో పదిహేను నిముషాల్లో ఒకచోటికి వెళ్లకపోతే కొన్ని వేలు నష్టం...." అంటూ మోటర్‌సైకిల్ స్టార్టు చేశాడు.

నా ముఖం బహుశా కొంచెం నల్లబడి ఉండాలి. ఉక్రోషంతో పక్కకు తొలగి నిలబడ్డాను. అతను తలవూపి 'వొస్తానోయ్' అంటూ ముందుకు సాగిపోయాడు.

అవును. నాకీ అవమానం జరుగవలసిందే.... ఇది నాలుగోసారి అనుకుంటాను, అతన్ని మా రూముకు రమ్మని పిలిచి అవమానం పొందటం. అవును మరి.... అతను శ్రీమంతుల అల్లుడు.... కాలు క్రింద పెట్టకుండా, అత్యవసరమైతే తప్ప ఎండలోకి రానవసరంలేకుండా కాలం గడుపుతా డతడు. కొన్ని చోట్లకు నిముషాలమీద వెళ్లకపోతే అతనికి వేల కొద్దీ రూపాయలు నష్టం. అతడు నాకు చాలా యేళ్ల క్రితం ఇంటర్మీడియేట్ చదివే రోజులలో క్లాస్‌మేట్. ఆ పరిచయం కొద్దీ నేను ఉద్యోగంలో చేరగానే మొదటిసారి కనిపించినప్పుడు పలుకరించి వివరాలన్నీ తెలుసుకున్నాడు. నా ఉద్యోగం గురించీ, జీతం గురించీ అన్ని వివరాలూ చెప్పాను. నా జీతం నూటపాతిక రూపాయలని వినగానే అతడు ఒక్కసారి మొహం చిట్లించి "అదేమిటయ్యా మహానుభావా? ఆ జీతం డబ్బులతో ఇంత సిటీలో ఎలా బ్రతకటం? అబ్బో చాలా కష్టం...." అన్నాడు. తర్వాత అప్పుడప్పుడు తప్ప, అతడు తరుచుగా కనిపించేవాడుకాదు. కనిపించినప్పుడల్లా నేను అతన్ని 'మా రూముకు రమ్మ'ని ఆహ్వానించటమూ, అతడు వాచీ చూచుకొంటూ "అర్జంటుగా వెళ్లాలోయ్" అని నిరాకరించడమూ జరుగుతూనే ఉంది. అలా రాకపోకలు ప్రారంభమై స్నేహం పెంచుకుంటే, ఆ స్నేహాన్ని నేను మరొక విధంగా ఉపయోగించుకుంటా ననుకున్నాడో ఏమో మరి! సింహద్వారం దాటి వెళ్లేటప్పుడు రోజా పంపు వంకకు చూస్తూ ఉంటాను. అక్కడ పెద్ద క్యూ ఉంటుంది. వరసగా బిందెలూ, బొక్కెనలూ, కొన్ని కుండలూ బోర్లించబడి తమ వంతు కోసం ఎదురుచూస్తూ ఉంటాయి.

మేడ క్రిందిభాగంలో మెట్ల ప్రక్కనే చివరి పోర్షనులో బ్యాంకు గుమాస్తా ఒకాయన అద్దె కున్నాడు. ఆయన వరండాలో స్తంభాని కానుకుని నిలబడి బీడీ కాల్చుకుంటూన్నాడు. ఆయన కూతురు పి. యు. సి. చదువుతున్నది. బక్కపలుచగా ఎర్రగా ఉంటుంది. ఎప్పుడూ ముందు హాల్లో కిటికీ ప్రక్కగా పడక కుర్చీలో పడుకుని ఒక లావాటి పుస్తకం చదువుతూ ఉంటుంది. ఉదయంపూట ఆ అమ్మాయి కాలేజీకి వెళ్లేటప్పుడు చూస్తే నాకు ఎందుకో జాలి.... బోలెడు పుస్తకాలు ఒక చేత్తో గుండెల కదుముకుని, మరో చేత్తో టిఫిన్ గిన్నె పుచ్చుకొని గాలిలో తేలిపోతున్నట్టు నడుస్తూ వెళ్లిపోతుంది. శక్తికి మించిన చదువు ఆమెను పెరగనివ్వడం లేదని నా అభిప్రాయం. ఆ పిల్ల అన్న ఒక డున్నాడు. వాడిపేరు రాజేంద్ర. ఇంట్లో 'రాజా' అని పిలుస్తూ ఉంటారు. వాడికి చదువు వంటబట్టలేదు. పైగా చెడుసావాసా లున్నాయి. ఆ ఈడుకే సిగరెట్లు తెగ కాల్చిపారేస్తూ ఉంటాడు. ఇంట్లో ఎవరి మాటా వినడు. పక్కయిళ్లలో కూడా వాడంటే అందరికీ హడల్ .... ఉన్నట్టుండి ఏదో దొరికిన వస్తువు చేత పుచ్చుకుని వెళ్లిపోతూ ఉంటాడు. ఒకసారి ప్రక్కయింటివారి అలారం గడియారం పట్టుకుపోయి ఎక్కడో పది రూపాయలకు అమ్మి జల్సా చేశాడు. వారు ఆ విషయం వాడి తండ్రికి చెప్పి "కొంచెం అదుపులో పెట్టుకోండి" అని సలహాయిస్తే ఆయన ఖండితంగా "మావల్ల కాదు. పోలీసు రిపోర్టు యివ్వండి. జైల్లో పడితే మాకూ పీడ విరగడైపోతుంది" అన్నాడు. ఆ భార్యాభర్త లిద్దరికీ ఆడపిల్లమీద బోలెడన్ని ఆశలు. ఆపిల్ల పరీక్షలు ప్యాసై మంచి ఉద్యోగం సంపాయించి తమకు ముసలితనంలో ఆధార మవుతుందని వారు కొండంత ఆశతో ఉన్నారు.

—అలవాటు ప్రకారం మెట్లెక్కుతూ ఉండగా రెండో అంతస్థులో ఉండే హిందూస్తానీ వ్యక్తి నావంక కొరకొరా చూశాడు. వాళ్లమ్మాయి నా చెప్పుల చప్పుడు విని పాము లాగా తల గుమ్మం బయటికి పెట్టి చూసి మళ్లీ లోపలికి వెళ్లిపోయింది.

—నేను రూము ముందు నిలబడి తాళంచెవి వెదికి తీసుకుని తాళం తీసి లోపల ప్రవేశించాను. పొద్దు గూకుతున్న కారణంగా లోపల వెలుతురు తక్కువగా ఉంది. నేను లోపల అడుగు పెడుతూనే కిటికీ పక్కన సాలీడు వంక చూశాను. అది నిశ్చలంగా ఉంది.

చెప్పులు విడిచి, లైటు వేసి, చాపమీద నడుం వాల్చాను. గొంతెత్తి పాడుకోవా లనిపించింది. అంతలోనే దగ్గు వచ్చింది. ఒక్క నిముషంసేపు అలా దగ్గుతూనే ఉండిపోయాను. నీళ్లు నిండిన కళ్లను తుడుచుకుంటూ ప్రక్కనే ఉన్న అద్దం చేతిలోకి తీసుకొని చూసుకుంటే మొహమంతా ఎర్రగా కంది పోయి భయంకరంగా కనిపించింది.

గది నాలుగుమూలల నుంచీ నామీదికి దండెత్తుతున్న ఒంటరితనం నా శక్తిని హరించివేస్తున్నది. ఒంటరితనం కేన్సర్‌లా నన్ను తినివేస్తున్నది. ఇప్పటికే క్రూరమైన షార్క్ చేపలాగా అది నన్ను చాలా భాగం తినివేసింది. మరి కొద్ది రోజులలో పూర్తిగా తిని త్రేన్పుకుంటూ వెళ్లిపోతుంది.

“పిక్నిక్‌లో నా పాట మొదటి అయిటం....” గొంతెత్త బోయాను.

మళ్లీ అంతలోనే గొంతునొప్పి వస్తుందనే భయంతో వొళ్లు జలదరించింది. అలాగే కళ్లు మూసుకుని నిశ్చలంగా కూర్చుండిపోయాను.

## 2

—మరునాడు ఉదయం రూముకు తాళంవేసి బయలు దేరుతూ ఉండగా ఆ ప్రక్క గదిలో ఉండే వరప్రసాద్ కిటికీలో నుంచి తన ట్రాన్సిస్టర్ ట్యూన్ చేస్తూ కనిపించాడు. అతనిది అసలు గోదావరి జిల్లాలో ఏదో వూరు. కలవారి చిన్నవాడు. ఎప్పుడూ చాలా హుషారుగా ఉంటాడు. నా యీడువాడే. సెంట్రల్ గవర్నమెంటులో ఏదో ఉద్యోగం. నెలలో కనీసం పది రోజులు క్యాంపులమీద వెడుతూ ఉంటాడు.

—అతడు నవ్వుతూ యివతలికి వచ్చి “రెండు రోజుల నుంచీ కనిపించడమే మానేశారేం గురువుగారూ ?” అని అడిగాడు.

నేను మెట్లు దిగబోతూ ఆగి వెనుదిరిగి “ఒక స్నేహితుడు వచ్చాడు. అందువల్ల రెండు రోజుల నుంచీ ఒకటే తిరుగుడై పోయింది” అని చెప్పాను.

అతడు హుషారుగా “ఇవాళ సాయంకాలం స్టేడియం గ్రౌండ్స్‌లో ఫుట్‌బాల్ ఫైనల్సు ఉంది. మీరు కూడా రాగూడదూ ? వెళి వద్దాం....” అన్నాడు.

నేను రెండు మెట్లు దిగి “చూద్దాంలెండి .... సాయంకాలం పెందరాళే మీరు మా ఆఫీసుకు రండి” అన్నాను. అతడు “ఓ. కే” అంటూ తన రూములోకి వెళ్లిపోయాడు.

నే నప్పు డలా అన్నానే గాని తీరా మెట్లు దిగుతూ ఉండగా ఎందుకో అనాలోచితంగా మాట్లాడా ననిపించింది. అక్కడ విపరీతమైన జనసందోహం ఉంటుంది. అక్కడ నాకు వూపిరాడదు. ఎందుకో అలసటా ఆయాసమూ వస్తాయి. ఆ జనసమూహం తుఫాను నాటి సముద్రంవలె కోలాహలం చేస్తూ ఉంటుంది. దాని అడుగున ఎక్కడో ఆ ఎనిమిది చేతుల భయంకర జంతువు ఉండే ఉంటుంది.... అది షార్క్‌లా వెంటాడి నన్ను కేన్సర్‌లా కబళించక మానదు.

—నేను నెమ్మదిగా నడవటం ప్రారంభించాను. ఈ నగరం గురించి చిత్రమైన విషయం ఏమిటంటే— ఇక్కడ చాలా ఆలస్యంగా తెల్లవారుతుంది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా నగరం నిద్రమత్తులో నుంచి బయట పడదు. ఆవేళప్పుడు రోడ్డుమీద నడుస్తూ ఉంటే అక్కడొకరూ అక్కడొకరూ మత్తు నిండిన కళ్లతో బద్ధకంగా గంజాయి పీల్చిన వారిలా జనం ఎదురవుతూ ఉంటారు. మా ఆఫీసులో ఒకాయన మద్యనిషేధంలేని యీ ప్రాంతాలను గురించి తమాషాగా “మాగాణి భూములంటే యివి. వెట్‌ల్యాండ్స్” అంటూ ఉంటాడు. నా గది ప్రక్కనే ఉన్న వరప్రసాద్ అప్పుడప్పుడు ‘బార్’ గురించీ, త్రాగుడు గురించీ చెబుతూ ఉంటాడు.

—ఒక నడివయసు వ్యక్తి మఫ్లరు మెడ చుట్టూ బిగించుకుంటూ ఎర్రబడిన కళ్లతో పేవ్‌మెంట్ మీద నడిచి పోతున్నాడు. అతన్ని చూస్తే రాత్రి బాగా తాగి మత్తుగా గడిపి యిప్పుడే యీ ప్రపంచంలో పడుతున్నవాడిలా కనిపించాడు. అసలు తాగుతూ ఉంటే ఎలా ఉంటుందో! గొంతు మంట పుడుతుంది కాబోలు ! గొంతులో మంట పుట్టించే ఆ ద్రవం అసలు ఎందుకు త్రాగాలి ? దానివల్ల ఏమిటి లాభం ?

—హఠాత్తుగా డాక్టరు నన్ను పరీక్ష చేసినప్పటి దృశ్యం గుర్తుకు వచ్చింది. నన్ను నిలువెత్తు పెట్టెలో నిలబెట్టి మాట్లాడుతూ ఉండమని గుండె, వూపిరితిత్తులూ, గొంతూ పరీక్ష చేశాడు. అది ఎక్స్‌రే పరీక్ష కాబోలు ! ఆయనకు అప్పుడు ఏం కనిపించి ఉంటుంది ? నా కంఠనాళాలూ, లోపలి ఎముకలూ, జబ్బూ కనిపించి ఉండాలి.

—దగ్గు వస్తూవుంటే ప్రయత్నంమీద అణుచుకో బోయాను. అందువల్ల దగ్గకనూ తప్పలేదు. బాధపడకనూ తప్పలేదు. కొన్ని క్షణాల అనంతరం ఆ బాధనుంచీ తేరుకుని రుమాలుతో కళ్లు తుడుచుకుని గొంతు సర్దుకున్నాను. “పిక్నిక్‌లో నా పాట మొదటి అయిటం....” కొంచెంగా కూని రాగం తీయబోయి అంతలో బస్ స్టాప్ దగ్గర పడటంవల్ల ఆ ప్రయత్నం విరమించుకున్నాను. క్యూలో నిలబడితే ఎదు

రుగా హోటల్లో కౌంటర్ ముందు కూర్చుని ఉన్న బట్టతల వ్యక్తి కనిపించాడు. హోటల్లో అట్టే రద్దీలేని కారణంగా చేతిమీద గడ్డం ఆనించుకుని విశ్రాంతిగా కూర్చుని ఉన్నాడు. ఆ ప్రక్కన స్టేషనరీ స్టోర్సు యజమాని బహుశా అందరికంటె ముందుగా తన కొట్టు తెరుస్తాడనుకుంటాను. అతడు లోపల కూర్చుని పత్రిక తిరగవేస్తున్నాడు.

—బుల్లి చేతివాచీ ధరించే ఆ పచ్చని పడుచు క్యూలో నా వెనక చేరింది. పలుచగా పౌడరద్దిన మొహాన్ని తన చేతి రుమాలుతో తుడుచుకున్నది. అంతలో మృదువైన, హాయి గొలిపే పరిమళం ఏదో కొద్ది అడుగుల కైవారంలో వ్యాపించి నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. నాకు గొంతులో మంట పుట్టింది. దగ్గు తెర రాబోతే బలవంతంగా అణుచు కున్నాను. వెనుదిరిగి ఒక్కసారి చూస్తే ఆమె చేతిలోవున్న పుస్తకంమీద గుండ్రని అక్షరాలతో ఆమె పేరు కనిపించింది. ఆ పేరు ఏమిటో, ఆమె ఏం చేస్తున్నదో తెలుసుకోవా లనిపిం చింది గాని, తదేకంగా అటే చూస్తే ఆమె అన్యథా భావించే అవకాశం ఉన్నదని తోచడంవల్ల మళ్లీ చూపులు తిప్పు కున్నాను.

—బస్సు వస్తూవుండటం గమనించి అక్కడ ఉన్న నలుగు రయిదుగురూ సర్దుకుని నిలబడ్డారు. బస్సు పూర్తిగా ఖాళీగా ఉంది. నేను చిల్లర పైసలు చేతిలో ఉంచుకుని లోప లికి ఎక్కి ఒకచోట కూర్చుని వెనుదిరిగి చూశాను. బస్సు కదిలిన కుదుపు మూలంగా ఆమె ముందుకు తూలింది. కూర్చునే లోపుగానే ఆమె చేతిలో పుస్తకం నా కాళ్ల దగ్గర పడింది. నేను వంగి దాన్ని తీసుకుని ఆమెకు అందించాను. ఆమె 'థ్యాంక్స్' అన్నది అస్పష్టంగా. అప్పుడు చక్కగా చూడ గలిగాను, ఆర్. రత్నావళి అనే పేరు. తర్వాత చూపులు తిప్పుకుని ముందుకు చూస్తూ కూర్చుండిపోయాను. ఆ పేరు మళ్లీమళ్లీ జ్ఞాపకం చేసుకోవా లనిపించింది. నా కది అంత మధురంగా ధ్వనించింది.

ఆనాడు స్వింగ్ డోరు తెరుచుకుని వచ్చిన డాక్టరు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. "కంగారుపడ నక్కరలేదు. త్వరలో అంతా సర్దుకుంటుంది."

బహుశా అంతా సరు కుని ఎప్పుడైనా మధుసూదనం చెప్పినట్టు పెళ్లి చేసుకుంటానేమో! "నాకు కాబోయే భార్య యిలా ఉండాలి" అని నేను కొంతకాలం క్రిందట కలలు కనేవాణ్ణి. అలా నేనూహించిన విధంగానే, అటు వంటి అమ్మాయినే పెళ్లిచేసుకుంటే చాలా సంవత్సరాలకు ఎప్పుడో మాకు ఒక బుల్లి పాపాయి పుట్టినప్పుడు, 'రత్నావళి' అని పేరు ఉంచుదామని నేను నా భార్యతో అంటాను. ఆమె తప్పక ఒప్పుకుంటుంది.

బస్సులో ఒక వ్యక్తి ఏవేవో మూటలతో ఎక్కేందుకు ప్రయత్నిస్తూ ఉంటే కండక్టరు తల అడ్డంగా వూపుతూ 'వీల్లేదు' అంటూ బెల్ మ్రోగించాడు. పేవ్‌మెంట్‌మీద నిస్సహాయంగా మూటలతో నిలబడిపోయిన ఆ వ్యక్తినిచూస్తే గుండెలలో చేయిపెట్టి కలచినట్టయింది.

పలుచని బంగారు రంగు ఎండ అంతటా వ్యాపి స్తున్నది. ఉన్నట్టుండి వీధులలో రద్దీ ప్రారంభం అయింది. కార్లూ, రిక్షాలూ, ఆటోరిక్షాలూ, స్కూటర్లూ, మోటారు సైకిళ్లూ, సైకిళ్లూ రివ్వున సాగిపోతున్నాయి. అంతవరకూ మత్తులో జోగుతూ తూగుతూ ఉన్న నగరం హఠాత్తుగా ఎవరో తట్టి లేపినట్టు హడావిడితో నిండిపోతున్నది.

నేను దిగబోతూ బస్సులో చూస్తే బుల్లి చేతివాచీ అమ్మాయి—రత్నావళి—లేదు. ఎక్కడ దిగిపోయిందో మరి.

నేను రోజూ ఆఫీసు ముందు బస్సు దిగగానే పేవ్ మెంట్ మీద నాలుగు చక్రాల బండిలో తినుబండారా లమ్ము కొనే గడ్డం సాయిబు నవ్వుతూ పలకరిస్తాడు. అతనికి ఏభై యేళ్లుంటాయి. అయిదుగురు ఆడపిల్లల తండ్రి. మాటి మాటికీ "నారు పోసినవాడు నీరు పొయ్యడా .... అన్నిటికీ అల్లా ఉన్నాడు" అంటూ ఉంటాడు.

ఎప్పుడో యుద్ధంలో పనిచేశాడట. ఎడమకాలిలో యిప్ప టికీ తుపాకీగుండు ఉందని చెబుతూ ఉంటాడు. అతడు నన్ను చూసి "క్యా సాబ్ ? రెండు రోజుల్నుంచీ కనిపించింది లేదేం ?" అని అడిగాడు. నేను నవ్వి "సెలవు పెట్టాను" అంటూ ఆఫీసు లోపలికి నడిచాను.

ఆఫీసు క్యాంటీనులో కొద్దిమంది మాత్రం ఉన్నారు. అక్కడ మా సెక్షను వాళ్లెవరూ కనిపించలేదు నాకు. టోకెన్లు తీసుకుని ఒకచోట కూర్చుని టిఫిన్ తీసుకున్నాను. ఆ తిన్న కొంచెమూ చాలా నెమ్మదిగా తినవలసి వచ్చింది. గొంతులో నొప్పి క్రమక్రమంగా ఎక్కువవుతున్నది. గొంతులో ఏమున్నదో ఏమో! ఆ నిలువెత్తు ఎక్స్‌రే పెట్టెలో నన్ను నేను చూసుకో గలిగితే ఎంత బాగుండును!

జితేంద్రియరావు నవ్వుతూ పలకరించి వెళ్లాడు. అతని పేరు నాకు ఎప్పుడూ చిత్రంగా ఉంటుంది. అతడు పని చేసేది మా ఆఫీసులో ఒక చిన్న యూనిట్‌లో. అయిదుగురు గుమాస్తా లున్నారు. వారికి వేరే గది ఉంది. ఆ అయిదుగురిలో ఒకాయన హెడ్. అందర్నీ చిత్రమైన పేర్లు కలవారినే ఏరి అక్కడ పడేసినట్టుంది ప్రభుత్వం. ఆ హెడ్ పేరు వైనతేయరావు. నల్లగా, పలుచగా గద్దలాగే ఉంటాడు. జితేంద్రియరావు పక్క సీటులో పని తక్కువ. ఆ కుర్చీలో కునికిపాట్లు పడుతూఉండే వ్యక్తి వెంగళరావు. ఆ తర్వాతి వ్యక్తి నల్లగా లావుగా ఉంటాడు. అతని పేరు కోలాహలరావు. పెళ్లి కెదిగిన ఆడపిల్ల అనే పండు నిప్పులతో నిండిన కుంప టిని వీరోచితంగా గుండెలమీద ఉంచుకొని భరిస్తున్నా డాయన. మొన్న మొన్నటివరకూ నన్ను గురించి ఆచూకీలు తీసి నావెంటపడి తిరిగాడు. చివరకు శాఖను గురించో, గోత్రం గురించో ఎక్కడో యిబ్బంది వచ్చి ఆ ప్రయత్నం విరమిం

చాడు. దేవుడలా ఆ పిల్లకూ నాకూ ఎంతో మేలు చేశాడని పించింది. మరో గుమాస్తా పేరు వ్యాఘ్రేశ్వరరావు. సన్నగా రివటలా గాలి విసురుకే తూలిపోయేవాడిలా ఉంటాడు. అమిత భయస్థుడు. చాలా త్వరగా ఎవరో తరుముకు వస్తున్నట్టు మాట్లాడుతూ ఉంటాడు.

కాఫీ ముగించుకుని బయటికి వచ్చి మా యూనిట్‌లోకి నడిచాను. మళ్లీ మధ్యాహ్నం భోజనానికి తప్ప—సాయంకాలం అయిదు గంటల వరకూ బయటికి రావడం కుదరదు. ఆ మధ్యాహ్నం జీతం వస్తుందనే సంగతి గుర్తుకు వచ్చినా అట్టే ఉత్సాహం కలగలేదు. వెళ్లి సీటులో కూర్చున్నాను. మా హెడ్ అప్పటికే తన కుర్చీలో కూర్చుని ఫైళ్లు తిరగ వేస్తున్నాడు. ఆయనను చూస్తే నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. ఇల్లూ, పెళ్లాం, పిల్లలూ లేక యితరఆరాటాలూ యీ మనిషికి అసలు ఉన్నాయా? అని సందేహం కూడా కలుగుతుంది. ఇక్కడ చేసేపని చాలక యింటికి కూడా ఫైళ్లు మోసుకు పోతాడు. అప్పుడప్పుడు ''వర్క్ యీజ్ గాడ్'' అంటూ ఉంటాడు. నా మటుకు నాకు ఆ కాయితాలను చూస్తేనే ఎందుకో బాధగా ఉంటుంది. ముక్కుపొడి రంగులో ఉంటాయి అవి. అన్నీ రకరకాల అర్జీలు, ఉత్తరువులూ!

ఇంతకాలం నుంచీ యీ సీటులో పనిచేస్తున్నప్పటికీ నాకు యీ ఆఫీసు చేస్తున్న నిర్వాకం ఏమిటో, ఏయే ప్రయోజనాలు ఈ కరెస్పాండెన్స్ వల్ల సిద్ధిస్తున్నాయో యింతవరకూ తెలియదు. ఒకసారి ఒక ముసలి టీచరుకు డబ్బు ముట్ట జెప్పవలసి ఉండగా ఆ అర్జీ అన్ని చేతులూ దాటి వెళ్లి అన్ని అభ్యంతరాలూ తట్టుకుని ప్యాసయ్యేసరికి ఆ నిర్భాగ్యుడు 'హరీ' అన్నాడు పాపం! అటువంటి సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

ఒక్కొక్కరే వచ్చి తమ తమ సీట్లలో సర్దుకు కూర్చుంటున్నారు. రామమూర్తి నవ్వుతూ నా వంక చూశాడు. కొద్ది నిమిషాల్లో అందరూ ఎవరి పనిలో వారు మునిగిపోయారు. నేను పైన గిర్రున తిరిగే ఫ్యాను వంక చూస్తూ ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను. ప్యూను రాఘవులు నా ముందు బల్లమీద బారెడు పొడుగాటి కాయితాలు తెచ్చి పడేశాడు. వాటినిండా బోలెడు అంకెలు. అవన్నీ కూడి సరిచూడాలి. వాటిని చేతిలోకి తీసుకుని పని ప్రారంభించాను. కొంతదూరం కూడి మళ్లీ అనుమానం రావడంవల్ల పైకి వెళ్లాను. ఆ అంకెలన్నీ మహా సముద్రంలా ఉన్నాయి. ఎక్కడా దారీ, తెన్నూ కనిపించడంలేదు. ఆ సముద్రం అడుగున ఎక్కడో ఆ భయంకరమైన ఎనిమిది చేతుల 'ఆక్టోపస్' విహరిస్తున్నది. అది నా ఒంటరితనంలా, కేన్సర్‌లా కబళించివేస్తుంది తప్పదు.

పని పూర్తి అయిందనిపించి చేతులు తుడుచుకున్నాను. తల ఎత్తి గడియారం వంక చూస్తే మరొక గంట వ్యవధి ఉంది. అలాగే కిటికీలోనుంచి బయటికి చూస్తూ కూర్చున్నాను. అలా చూస్తూ ఉంటే ఎప్పుడూ ఆ ఆవరణలో ఉన్న పెద్ద మర్రిచెట్టు నా దృష్టిని ఆకర్షిస్తుంది. నాబోటివాళ్లు నలుగు రైదుగురు ఒకరి చేతులు మరొకరు పట్టుకుని గుండ్రంగా నిలబడితే దానిచుట్టూ నిలబడగలుగుతా మనుకుంటాను. పెద్ద పెద్ద వూడలు నేలలో దిగి పాతుకుపోయి ఉంటాయి. ఆ చెట్టుకు ఎన్నేళ్లు ఉంటాయో! అది చిన్న మొక్కగా జీవితం ప్రారంభించినప్పుడు యీ ఆఫీసు ఉన్న స్థలంలో ఏముండేదో!

ఆలోచనలో పడిన నన్ను ప్యూను పిలిచాడు. నాకోసం ఎవరో వచ్చారని చెప్పాడు. నేను లేచి బయటికి వెళ్లి చూద్దునుకదా! వరప్రసాద్ నిండుగా నవ్వుతూ హుషారుగా ''రమ్మన్నారుగా గురూజీ! పోదాం పదండి. లెటజ్ గో....' అన్నాడు.

అతనివంక చూస్తూ ఒక్క నిముషంసేపు సముద్రం అడుగున ఉండే ఆ భయంకర ప్రాణిని గురించీ, నన్ను నిరంతరం నిద్రలో కూడా వెంటాడే ఒంటరితనం గురించీ మరిచిపోయాను. అతనిలా నవ్వుతూ, తుళ్లుతూ హుషార్‌గా ఉండగలగటం ఎంత అదృష్టమో అనిపించింది. కాస్సేపు అతన్ని అనుకరిద్దా మనుకున్నాను. అందుకని అతనిలాగే నవ్వేందుకు ప్రయత్నించి ''సరే. పోదాం. నేను జీతం తీసుకు వచ్చేస్తాను. ఒక్క నిముషం ఆగండి.'' అని చెప్పి అతన్ని కూర్చోబెట్టి వెళ్లి జీతాలు యిచ్చే క్లర్కు దగ్గర నిలబడ్డాను. అక్కడ కళ్లజోడు సవరించుకుని నా చేతికి పెద్ద పుస్తకం అందించి సంతకం పెట్టించుకుని క్యాష్ చెస్ట్ తెరిచి పది రూపాయల నోట్లు వరసగా తీసి లెక్కపెట్టడం ప్రారంభించాడు. నేను అతడు లెక్కపెడుతూ ఉంటే కన్నార్పకుండా చూస్తూ నిలబడ్డాను. అతడు చాలా జాగ్రత్తగా రెండు మూడుసార్లు లెక్కపెట్టి ఆ తర్వాత డబ్బు నాచేతికి అందించాడు. ఇక నేను లెక్కపెట్ట నవసరంలే దనిపించింది. ఆబొత్తిని అలాగే జేబులో ఉంచుకుని వెనుదిరిగాను. ఆ క్షణంలో బస్సులో తటస్థపడిన వృద్ధురాలూ, ఆమె మాటలూ గుర్తుకు వచ్చాయి. ఆమె కొడుకు ఇంట్లో డబ్బు యిచ్చాడో లేదో! లేకపోతే 'కోడలూ, పిల్లలూ, నేనూ ఈ నెలంతా పస్తుండక తప్పదు' అన్న మాటలు చెవులలో ప్రతిధ్వనించాయి.

మెట్లు దిగుతూ ఉంటే రామమూర్తి ఎదురుపడి ''ఏమండోయ్! వెళ్లిపోతున్నారల్లే ఉంది అప్పుడే. వచ్చేవారం పిక్‌నిక్ సంగతి మరిచిపోకండి. ప్రోగ్రాంలో మొదటి అయిటం...'' అంటూఉండగానే నేను తలవూపి త్వరత్వరగా దిగి వచ్చేశాను.

ప్రతినెలా నేను జీతం తీసుకున్న వెంటనే తప్పనిసరిగా చేయవలసిన పని ఒకటి ఉంది. దాని తర్వాతనే మరేదయినా. వరప్రసాద్‌తో కలిసి వెళ్ళే దోవలోనే ఆ పని పూర్తిచేసుకు మరీ వెళ్లవచ్చు.

ఇద్దరం కలిసి బయటికి వచ్చేటప్పుడు అతనితో అన్నాను. ''మనకు ఇంకా వ్యవధి ఉంది కదా? వెళ్లే దోవ

లోనే నాకు ఒక చిన్న పని ఉంది. రెండు మూడు నిముషాల కంటే ఎక్కువ పట్టదు."

వరప్రసాద్ వాచీ చూసుకుని "ఫరవాలేదు. మనకు చాలా టైం ఉందిలెండి" అన్నాడు.

ఇద్దరం నడవటం ప్రారంభించాము. సాయంకాలపు ఎండ ఆహ్లాదకరంగా హాయిగా ఉంది. నిర్మేఘమైన ఆకాశం స్వచ్ఛంగా అద్దంలా ఉంది. రకరకాల పక్షులు రకరకాలుగా ఈలలు వేసుకుంటూ ఎగిరిపోతున్నాయి. వరప్రసాద్ యీల వేస్తూ నడుస్తున్నవాడల్లా ఆగి "అన్నట్టు గురూజీ! ఈమధ్య మీ పాటలు వినిపించడం మానేశారేం ? రూములో ఒంటరిగా ఉన్నప్పుడు కూడా నిశ్శబ్దంగా ఉంటున్నారు. అంతకు ముందు కదలకుండా అలా కూర్చుంటే చాలు మీ రూములో నుంచి ఎంత హాయిగా పాటలు వినేవాణ్ణి !" అన్నాడు.

అదుగో, సముద్రం అడుగున ఉండే ఆ ఎనిమిది చేతుల భయంకర జంతువు మళ్లీ కదులుతున్నది. నే నతని కేమీ సమాధానం చెప్పకుండా ఒకచోట ఆగి "ఇలా లోపలికి రండి. ఒక్క నిముషంలో వెళ్లిపోదాం" అన్నాను.

వరప్రసాద్ ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసి "ఇక్కడేం పని మీకు ?" అని అడుగుతూనే ఉన్నాడు. అంతలోనే నేను లోపలికి వెళ్లిపోయాను. వరప్రసాద్ బహుశా అక్కడే 'అన్నదాన సమాజము' అన్న చిన్న బోర్డు వంకా, ఆ ప్రక్కనే అప్పుడే రాత్రి భోజనానికి క్యూలో నిలబడిఉన్న చింపిరితలల, చింపిరి గుడ్డల మనుష్యులవంకా చూస్తూ నిలబడి ఉంటాడు.

చేతులు కట్టుకుని కిటికీలో నుంచి పెరటిలోకి చూస్తున్న ఆ సన్నని వ్యక్తిని చూడగానే నా మనసు ద్రవించింది. ఆయన ఏదో పెద్ద పోరాటంలో వోడిపోయి అలసి పోయిన వాడిలా ఉన్నాడు. "జీవితంలో సగభాగం అనుకున్నది సాధించకుండానే గడిచిపోయింది" అని దిగులుపడుతూన్నవాడిలా కనిపించాడు.

నా అడుగుల చప్పుడు విని వెనుదిరిగి చూసి నవ్వి "మీరు వచ్చారా ?" అన్నా డాయన, పాత కుర్చీలో కూర్చుని లోపలినుండి రశీదు బుక్కు తీస్తూ.

నే నాయన ఎదురుగా కూర్చుని జేబులో నుంచి పది రూపాయల నోటు నొకదాన్ని తీసుకుని చేతిలో ఉంచు కున్నాను. ఆయన రశీధు వ్రాస్తూ ఉండగా లోపలికి చూస్తే ఆయన భార్య పొద్దుగూకేసరికి ఆకలితో నకనకలాడుతూ వచ్చి క్యూలో నిలబడే నిర్భాగ్యులకోసం వండి వారుస్తున్నది. ఆమె జుట్టు నెరిసి, నడుం వంగిపోయి జవసత్వాలుడిగిపోయిన స్థితిలో ఉంది. ఆయన రశీదు యిచ్చి పది రూపాయల నోటు పుచ్చుకుని నాకు నమస్కారం చేశాడు. నాకు కళ్లవెంట నీళ్లు ఉబికి వచ్చాయి. నిలువెల్లా సిగ్గుతో కంపించిపోయాను. నే నెన్నోసార్లు "ఈ రశీదు లెందుకండీ?" అన్నాను ఆయనతో, కాని ఆయన నవ్వి "అది ఒక సంప్రదాయం. మనం పాటించాలి. అంతే" అన్నాడు.

"వస్తానండీ" అని చెప్పి గుమ్మం దాటుతూ ఉండగా ఆయన నమస్కారం చేయడం గుర్తువచ్చి మళ్లీ కళ్లలో నీటిపొర నిలిచింది. ఆ నీటితెరలోనుంచి వరండాలో నిలబడి అక్కడి పోస్టర్లు, బోర్డులు చదువుతున్న వరప్రసాద్ కనిపించాడు. నే నతని భుజం తట్టి "వెడదాం, రండి ...." అన్నాను. అతడు తల తిప్పి నావంక చూశాడు. మళ్లీ అంతలోనే అవి చదువుతూ నిలబడిపోయాడే గాని కదలలేదు. నాకు అక్కడ నిలబడటం అంతగా నచ్చలేదు. బయట గుమ్మంముందు చేరిన పది పదిహేను మంది మనుష్యులు మావంక కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్నారు. వారిలో ఆ రాత్రికి ఎందరికి అన్నప్రాప్తి ఉందో తెలియదు. ఆ పూట తన శక్తినిబట్టి ఆ వ్యక్తి కొందరిని ఉంచి మిగిలినవారిని వెళ్లిపొమ్మని చెబుతూ ఉంటాడు. ఒక్కొక్కప్పుడు చేరినవారు తమలో తాము పోట్లాడుకుంటూ ఉంటారు కూడా. 'నేను ముందు నిలబడ్డాన' ంటే, 'నేను నీకన్నా ముందు నిలబడ్డాన' ని ఒకరితో ఒకరు కాట్ల కుక్కలవలె వాదులాడుకుంటూ ఉంటారు. 'కొంతమందిని ఉండమ' నీ, మిగిలినవారిని వెళ్లమనీ చెప్ప వలసి వచ్చినప్పుడు ఆ వ్యక్తి మొహం చూడటం పెద్ద శిక్ష. నిస్సహాయుడై, ఏదో పెద్ద తప్పు చేస్తున్నవాడిలా నిలువునా ఒణికిపోతూ చెబుతాడా మాటలు. ఆయన చెప్పగానే వెనక నిలబడినవారు కొందరు వెళ్లిపోతారు. అప్పుడప్పుడు ఒక్కొక్క తలపొగరు మనిషి నోట పట్టరాని తిట్లు తిడుతూ వెళ్లి పోతాడు.

ఎట్టకేలకు వరప్రసాద్ మెట్లు దిగి యివతలికి వచ్చాడు. ఇద్దరం రోడ్డుమీదికి వచ్చి నిశ్శబ్దంగా కొన్ని అడుగులు వేశాము. నేను వరప్రసాద్ వంక చూశాను. అతడు చేబుల్లో చేతులు పెట్టుకుని నడుస్తూ ఆగి నా భుజం పట్టుకుని "మీరు ప్రతి నెలా యిలా యిస్తూ ఉంటారా ?" అని అడిగాడు.

నేను తల వూపాను. మరొక అడుగు ముందుకువేసి "ఆయనను నేను ఎక్కడో చూశాను. బహుశా ఏదో పోస్టాఫీసులో అనుకుంటాను" అన్నాడు.

"అవును. ఆయనకు పోస్టాఫీసులోనే ఉద్యోగం. చాలా ఏళ్లనుంచీ ఈ అన్నదాన సమాజం నడుపుతున్నాడు. నెల జీతంలో చాలాభాగం యిందుకే కేటాయిస్తాడు. పిల్లలూ, యితర బాదర బందీ లేవీ లేవనుకోండి" అన్నాను నేను.

వరప్రసాద్ ఉన్నట్టుండి "ఒక్క క్షణం ఆగండి ఇప్పుడే వొచ్చేస్తాను" అంటూ వెనుదిరిగి మళ్లీ లోపలికి వెళ్లాడు. నేను అలాగే వీధిలో నిలబడిపోయాను. రెండు నిముషాల తర్వాత అతడు ఇవతలికి వచ్చి నన్ను కలుసుకుని "పదండి పోదాం" అన్నాడు త్వరత్వరగా నడుస్తూ.

అతని టెరిలిన్ చొక్కా జేబులో ఆ ఎర్రరంగు రశీదు కాయితం స్పష్టంగా కనిపించింది నాకు. వీధి చివర ఆగి

వెనుదిరిగి చూస్తే అన్నదానసమాజం ముందు ఆయన నిలబడి మా వంకనే చూస్తూ ఉండటం కనిపించింది.

## 3

మేమిద్దరమూ బస్సుకోసం నిలబడిఉండగా వరప్రసాద్‌తో అన్నాను. "ఆయనపేరు సత్యమూర్తి. నాకు మొట్టమొదటి సారిగా ఒక రైలు ప్రయాణంలో పరిచయం అయింది ఆయనతో. మేమిద్దరం అప్పుడు చాలా విషయాల గురించి మాట్లాడుకున్నాం. ఆయన అప్పుడీ విషయాలేవీ చెప్పలేదు. మళ్లీ చాలా రోజుల తర్వాత ఒకసారి సెంటర్లో కనిపించాడు. నేను పలకరించగానే గుర్తుపట్టి ఆప్యాయంగా మాట్లాడాడు. తమ ఇంటికి ఒకసారి రమ్మన్నాడు. వెళ్లాను."

ఒక బస్సు వచ్చి యిద్దరు ముగ్గురిని మాత్రమే ఎక్కించుకుని వేగంగా వెళ్లిపోయింది. వరప్రసాద్ వాచీ చూసుకుని "యిలా అయితే మనం వేళకు అందుకోలే మను కుంటాను. పోనీ రిక్షామీద వెళ్లిపోదాం" అంటూ ఖాళీగా వెడుతున్న రిక్షాను పిలిచి బేరమాడి 'ఎక్కండిసార్' అన్నాడు. ఇద్దరమూ కూర్చోగానే రిక్షా తూనీగవలె రివ్వున పరు గెత్తడం ప్రారంభించింది.

నేను మళ్లీ చెప్పాను.

"తీరా అక్కడికివెళ్లగానే'అన్నదాన సమాజము'అన్నబోర్డు చూసి నివ్వెరపోయాను. అప్పుడు వాకిట్లో చాలామంది నిలబడి వున్నారు. వారి మొహాలలో, మాటలలో, చూపులలో అంతటా ఆకలి...కాన్సర్‌వంటి ఆకలి..నాకు కడుపులో దేవినట్టయింది. లోపల ఎత్తున వంట పనిచేస్తున్న ఆడమనిషిని చూపించి ఆయన 'నాభార్య' అని చెప్పాడు. ఆయన పల్లెత్తి వేరే ఒకమాట అయినా చెప్పకుండానే నేను అంతా గ్రహించాను. ఇంతకుముందు పొద్దునా, సాయంకాలమూ ఆఫీసు వేళలలో తప్ప మిగిలిన సమ యాలలో ఎవరెవరి దగ్గరకో కాళ్లకు బలపాలు కట్టుకుని తిరిగే వాడు. ఒక్కొక్కప్పుడు బస్సు చార్జీలు కూడా దండగ అనిపించేవి. ఇప్పుడు అంతగా తిరగలేక తన ఆఫీసులోనే ఎవరో కొద్ది మంది దగ్గర వారు యిచ్చినంత పుచ్చుకుని వూరుకుంటున్నాడు. ఇచ్చినవారు యిస్తారు లేనివారు లేదు. అందువల్ల కొన్నినెలలుగా చూస్తున్నాను, చాలా నీరసపడిపోయాడు."

గ్రౌండ్స్ సమీపంలోకి వెళ్లేదాకా వరప్రసాద్ ఏమీ మాట్లాడలేదు. తీరా రిక్షా దిగి చూస్తే టిక్కెట్లు యిచ్చేచోట పెద్ద క్యూ కనిపించింది. లోపల కూడా బోలెడంత మంది జనం చేరినట్టున్నారప్పుడే. లోపల అంతా కేకలూ, గోలా రణగుణ ధ్వనిగా వుంది. నల్ల కళ్లజోళ్లూ, (? ఇస్త్రీ)స్కర్టులూ, టెరిలిన్‌లూ, నన్నని ప్యాంట్లూ, తళతళలాడే బూట్లు, చూయింగ్‌గమ్‌లు, జోకులు, నవ్వులు, పందేలు, పై పందేలు, సవాళ్లతో వాతావరణం అంతా కోలాహలంగా వుంది.

వరప్రసాద్, వెనకనే నేనూ, క్యూలో నెమ్మదిగా ముందుకు కదులుతున్నాము. అంతలో వరప్రసాద్ స్నేహితులు కాబోలు కొందరు వచ్చారు. నేను ఏమీ తోచనివాడిలా వారిని లెక్కపెట్టాను. ఎనిమిది మంది. అందరూ ట్రిమ్‌గా, హుషా రుగా వున్నారు. వరప్రసాద్ వారికి నన్ను పరిచయం చేశాడు. "నేనెప్పుడెప్పుడు చెబుతూ వుంటానే మా ప్రక్క రూములో మిత్రుణ్ణి గురించి, వీరే..అద్భుతంగా పాటలు పాడతారు. మిస్టర్ భానుమూర్తి."

నేను వారందరితో కరచాలనం చేశాను. వాళ్ల చేతులు వేడిగా ఉన్నట్టు అనిపించింది. నా చేతులు ఎప్పుడూ చల్లగా వుంటాయి ఎందుకో మరి.

వాళ్లు అన్నారు: "మిమ్మల్ని గురించి మా ప్రసాద్ చాలా సార్లు చెప్పాడు. మేము మిమ్మల్ని వొదిలిపెట్టంలెండి. ఎప్పుడో ఒకసారి మీ పాటలు వినిపించాలి తప్పదు." నేను నవ్వుతూ తలవూపానేగాని ఏమీ మాట్లాడలేదు. వినిపిస్తాను. తప్పక వినిపిస్తాను. ఇప్పుడిప్పుడే నీటి అడుగున ఆ దారుణ జంతువు తన ఎనిమిది చేతులనూ నెమ్మదిగా కదిలిస్తున్నది. నాగొంతు రోజులు గడిచే కొద్దీ భలేగా పలుకుతుంది. కాన్సర్ వలె భయంకరమైన ఒంటరితనమూ, ఒంటరితనం వలె భయంకరమైన కాన్సరూ నన్ను కొద్దికొద్దిగా తింటున్నాయి. ఇంకా అవి పూర్తిగా విజృం భించలేదు. షార్క్‌కు యింకా తన ఆకలి తెలియలేదు. తెలిస్తే దాని విజృంభణను ఏశక్తి అడ్డగించగలదు!

వాళ్లందరితో పాటు క్యూలో ముందుకు కదులుతున్నాను. దూరంగా ఎవరో ఐస్‌క్రీం తింటున్నారు. నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ తింటున్నారు. నాకు అన్నదాన సమాజంముందు రాత్రితిండికోసం యిప్పటినుంచే నిలబడిన మనుషుల ముఖాలు గుర్తుకు వచ్చాయి. వారివి షార్క్ చూపులు. వారి పరిసరాలలో అంతటా కాన్సర్, కాన్సర్... వారి మొహాలలో అంతటా ఆకలి ఆకలి,.. వారి హృదయాలలో అంతటా చీకటి, చీకటి...

'క్యూ' సముద్రాల లోతులలోవుండే అభయంకరమైననీటి జంతువు తాలూకు ఎనిమిది చేతులలో ఒక చెయ్యిలా వుంది. నేనందులో చిక్కుకున్నట్టున్నాను. టిక్కెట్లు అందుకుని అందరూ హుషారుగా లోపలికి నడిచారు. లోపల చెవులు బద్దలు చేసే రొద, గందరగోళం. మైక్‌లో ఏదో ఎనౌన్స్‌మెంట్లూ, ఈలలూ, కేకలూ. ఆట ప్రారంభం అయ్యేందుకు మరికొద్ది నిముషాలు మాత్రమే వ్యవధి ఉంది. మైక్‌లో ఆ విషయం పదేపదే చెబుతున్నారు.

ఎవరో ఈలవేస్తూ వుండగా చూశాను. మధుసూదనం గుర్తుకు వచ్చాడు. నేను చిన్నతరగతులు చదివే రోజులలో వారానికి రెండురోజులు వారి యింట్లో భోజనం చేసేవాణ్ణి. మిగిలిన అయిదు రోజులూ వేరే అయిదు యిళ్లలో భోజనం. ఆ రోజులలో మధుసూదనం ఎక్కడి నుంచి ఎలా సంపాయించుకు వచ్చేవాడో మరి.. అప్పుడప్పుడు చిల్లరడబ్బులు పట్టుకు వచ్చేవాడు. మేము ఆ డబ్బులతో మధ్యాహ్నం పూట మ్యాటినీ సినిమాలకు వెళ్లే వాళ్లం. వాటికి టిక్కెట్లు చవక. అవన్నీ ఏవేవో యింగ్లీషు

సినిమాలు. ఆ సినిమాల నిండా గుర్రపు స్వారీలూ, కత్తియుద్ధం, పిస్తోళ్లతో యుద్ధాలూ వుండేవి. అప్పుడు మధుసూదనం యిలాగే యీలలు వేస్తూ వుండేవాడు. ఆట ప్రారంభం అయింది. తెల్ల బనియనులవారూ, ఎర్రచారలబనియనులవారూ పట్టుదలతో ఎవరికి వారే గెలుపు మీద దృష్టి వుంచుకుని పట్టుదలతో ఆడుతున్నారు. నిమిషాలు గడిచే కొద్దీ జనంలోనూ హుషారు పెరిగింది. అందరూ విపరీతంగా అరుస్తున్నారు. చేతులు ఊపుతూ, రుమాళ్లు గాలిలో ఎగరవేస్తూ కోలాహలం చేస్తున్నారు. మా ముందు కొంచెం దూరంలోనే చెదరిన వెంట్రుకలను ఎడమ చేత్తో సర్దుకుంటూ రాజేంద్ర ఆట చూస్తున్నాడు. వాణ్ణి అప్పటికప్పుడు యివతలికి పిలిచి 'అలారం గడియారం అమ్మిన డబ్బుతో ఏయే జల్సాలు చేశాడో' కనుక్కుందా మనిపించింది.

క్రమంగా నాలో అసహనం బయలుదేరింది. పిచ్చాసుపత్రిలో, అర్థంపర్థం లేకుండా ప్రవర్తిస్తున్న వేలకొద్దీ పిచ్చివాళ్ల మధ్య ఒంటరిగా చిక్కుకున్న వాడిలా, సాలీడు గూటిలో చిక్కుకున్న అమాయకపు చిన్నపురుగులా అనుభూతి పొందాను. ఎందుకో ఆయాసం వచ్చినట్టయింది. గొంతులో ఏదో కదులుతున్నట్టు బాధ. దగ్గు వచ్చేట్టుంది. ఉన్నట్టుండి ఆకాశంలో మబ్బులు క్రమ్మి కుండపోతగా వర్షం కురిస్తే అప్పుడీ ఆటా, యీ ప్రేక్షకులగోలా ఏమైపోతాయి?

ప్రేక్షకుల కోలాహలం ఉన్నట్టుండి మిన్నుముట్టింది. అందరూ తమ కొంపలు కాలిపోతున్నట్టు చెవులు కోసిన మేకల్లా ప్రాణా లుగ్గబట్టుకుని అరుస్తున్నారు. ఏ పక్షం వారికో ఒక 'గోల్' అయింది. గ్రౌండ్‌లోనూ, ప్రేక్షకులలోనూ పెద్ద గందరగోళం. ఆకాశానికి చిల్లి పడుతుందేమో అనిపించింది.

ఆ సందడి తగ్గి మళ్లీ మామూలు ఆట ప్రారంభం అయింది. నేను తలఎత్తి పైకి చూశాను. ఒక్క మబ్బుముక్క మాత్రం కనిపించింది. సూర్యకిరణాలు పడటంవల్ల ఆ మబ్బు చుట్టూ వెండి చక్రం గీసినట్టున్నది.

నా మనసులో మళ్లీ కళ్లజోడు ముక్కు మీదికి జారుతూ వుండగా స్వింగ్‌డోరు తెరుచుకుని వచ్చి ప్రయత్నపూర్వకంగా నవ్వుతూ "కంగారు పడనక్కరలేదు. త్వరలో అంతా సర్దుకుంటుంది" అంటున్న డాక్టరు మెదిలాడు. ఆయనను మళ్లీ రెండుమూడు సార్లు చూశాను. రెండురోజుల కొకసారి 'రమ్మ'ని ఆయన అంటే నేను పదిరోజుల కొకసారి వెళ్లాను. ఆయన నుదుట ఎప్పుడూ చమటపడుతూవుంటుందెందుకో!

మళ్లీ కేకలు, రొద, గందరగోళం. 'గోలు' కాకుండా కాస్తంతలో తప్పిపోయింది. ఆ గ్రౌండులో పరుగులెత్తుతూ ఒకరి మీద గెలుపు కోసం మరొకరు ఆరాటపడుతున్న రెండు పక్షాలూ ఈ ప్రేక్షకుల వినోదం కోసం సతమతమవుతున్న ఆటబొమ్మల్లా కనిపించారు నాకు.

ఇక ఆకాశంలో మబ్బులు నమకూడవు. వర్షం అసలే రాదు. ఈ ఆట యిప్పట్లో ముగియదు. ఈలోపల కల్లోల సముద్రం అడుగున వుండే ఆ జంతువు నన్ను పసికడుతుంది. చచ్చిపోయిన పెద్దచేప మాంసం వాసన ఆ షార్క్ నాసికా పుటాలకు అంది తీరుతుంది. అది ఆకలితో కసిగా వేగంగా నావంకకు రాకమానదు.

నేను హఠాత్తుగా లేచి వరప్రసాద్‌తో "నేను అర్జంటుగా వెళ్లాలి మన్నించండి" అని త్వరత్వరగా జనాన్ని తప్పించుకుంటూ యివతలికి వచ్చేశాను. ఆ పరిసరాలు దాటి కొద్దిగజాలు నడిచి గట్టిగా ఊపిరి పీల్చి 'అమ్మయ్య' అనుకున్నాను. గొంతులో మంట పుట్టడం ప్రారంభించింది. దగ్గు కూడా వచ్చింది. అలాగే, రుమాలు నోటికి అడ్డం పెట్టుకుని నడుస్తున్నాను. ఆకలిగా వున్నట్టు అనిపించింది. నేరుగా హోటలుకు వెళ్లాలి. ముందు భోజనం చేయాలి. తర్వాత రూముకు వెళ్లి ఆ ఒంటిరి తనాన్నే మంచి చేసుకుని కౌగలించుకుని నిశ్శబ్దంగా పడుకోవాలి.

సూర్యుడు ఎర్రగా కాల్చబడిన లోహపు బంతిలా అస్తమించాడు. పశ్చిమదిశను ఆకాశం అంతా తగలబడిపోతున్న అరణ్యంలా వుంది. మబ్బులు భయంకరంగా ఎర్రగా వున్నాయి. పదునైన వెండి కొడవలి వలె చంద్రుడు ఒకవైపున అప్పుడే ఉదయించాడు. ఇవాళ వెన్నెల ఉంటుందా?

హోటల్లో కౌంటరు దగ్గర టిక్కెట్టు యిచ్చి టోకెన్ తీసుకుని చుట్టూ చూశాను. ఎక్కడా ఖాళీ కనిపించలేదు. నగరం అంతా క్యూలతో, టోకెన్లతో నిండినట్టనిపించింది. కొందరు వెయిటింగ్ లిస్టులో అక్కడ వున్న కుర్చీలలో కూర్చుని పేపర్లు చూస్తున్నారు. నేను కూడా వెళ్లి అక్కడ కూర్చుని అందరి వంకా చూశాను. అందరి ముఖాలూ యించుమించు అన్నదాన సమాజం ముందు నిలబడినవారి ముఖాల వలెనే వున్నాయి. అన్ని ముఖాలలోనూ ఆకలి. నా ముఖం ఎలా వుందో? లేచివెళ్లి చెయ్యి కడుక్కుంటూ ఎదురుగా ఉన్న అద్దంలో మొహం చూసుకున్నాను. అద్దంలో కనిపిస్తున్న ప్రతిబింబం నాదేనా అని అనుమానం వచ్చింది. చెయ్యి పైకి ఎత్తాను. అద్దంలో బొమ్మ కూడా చెయ్యి పైకి ఎత్తింది. నాలో నేను నవ్వుకోబోగా దగ్గు మళ్లీ వచ్చింది.

తర్వాత కొద్దినిముషాలు వేచివుండి ఒకచోట ఖాళీ చూసుకుని కూర్చుని ఆకు కడుగుతూ వుండగా వరప్రసాద్, అతని స్నేహితులు గుర్తుకు వచ్చారు. అలా హఠాత్తుగా వచ్చేసినందుకు ఏమనుకున్నారో ఏమో!

ఆకలితో దహించుకు పోతున్నప్పటికీ చాలా నెమ్మదిగా తినవలసి వచ్చింది. ముద్దముద్దకూ గొంతు 'భగ్గు'న మండుతున్నది. ముద్దముద్దకూ కళ్ల వెంట నీళ్లు తిరుగుతున్నాయి.

ఎలాగో తిండి ముగించి యివతలికి వచ్చి నడవటం ప్రారంభించాను. చీకటి పడింది. ఒక సినిమాహాలు దగ్గర "టిక్కెట్లు లేవు" అని బోర్డు తగిలించినా జనం యింకా తగ్గలేదు.

పేవ్‌మెంట్ మీద నడుస్తున్న ఒకవ్యక్తి వచ్చి 'ఢీ'కొన్నాడు. పైగా వెనుదిరిగి చూసి 'కళ్లు కనబట్టంలేదూ' అని అడిగాడు.

నేనేదో చెప్పబోయాను. మళ్లీ నా దగ్గరికి వచ్చి మొహంలో మొహం పెట్టి "ఇంకెన్నడూ తాగి రోడ్డు మీద తిరక్కు. ఎల్లు..." అన్నాడు. అతని నోటి వెంట ఏదో భరించరాని వాసన గుప్పుమని వచ్చింది. వెనుదిరిగి తూలుతూ పోతున్నాడు. నేను అతన్ని సమీపించి "మీ యిల్లు ఎక్కడ? నేను వెంట వచ్చి నిన్ను దిగబెడతాను." అన్నాను.

అతడు మొహం మీద పడుతున్న జుట్టు పైకి సర్దుకుంటూ ఒక్కక్షణం నావంక చూసి "ఓయస్..రా..మా యింటికి ఎటెల్లాలో నేను చెప్తాను. నువ్వు ముందుండి దారి చూపించు" అన్నాడు. నేను తలవూపాను. అతని వెంటనే నడవటం ప్రారంభించాను. ఒకచోట ఆగి 'కుడివైపు' తిరుగు అన్నాడు, కుడివైపు తిరిగాను. అతడు "అదీ..అలా గుండాలి.. ఇదేదోవ" అంటూ నా వెనకనే నడుస్తున్నాడు. మళ్లీ కొంచెం దూరం నడిచిన తర్వాత 'ఎడమవైపుకు తిరగమ'న్నాడు. ఆ చెప్పడంలో అతడు చూపించిన దర్జాకు నాకు నవ్వు వచ్చింది. అయినా చెప్పిన మాట వినే బుద్ధిమంతుడైన బాలుడి వలె అతను చెప్పిన వైపు నడిచాను. 'నా కొడుకులు.. దొంగాట ఆడతారు.. ముక్కలు దాచుకొస్తారు. దమ్ములుంటే ధర్మంగా, సజావుగా ఆడమను" అని గొణుక్కుంటున్నాడు.

చీకటి రాజ్యంలా వున్న చోటికి వచ్చాము. అక్కడ లైట్లు లేవు. వెలుతురులేదు. అంతటా దుర్గంధం.

చిన్నచిన్న చీకటి ముద్దలవలె గుడిసెలు. వాటిలో నుంచి కేకలూ, గోలా, పసిపిల్లల ఏడుపులూ,.. ఒక గుడిసెలో ఎవడో తాగి తెగ పేలుతున్నాడు. ఒకచోట ఎవరో పిల్ల సినిమా పాటలు పాడుతున్నది.

ఒక చీకటి ముద్ద దగ్గర అతడు 'హోల్డాన్' అని అరిచాడు. తర్వాత మిలిటరీవాడిలా శాల్యూట్ కొట్టి బాగా వంగి నడుస్తూ వెళ్లి గుడిసెలో దూరాడు. లోపల కొంచెం సంచలనం. పసిపిల్ల ఏడుపు.

నేను వెనుదిరిగి నడవబోయాను. నా వెనకనే "ఎవురది?" అన్న ప్రశ్న వినిపించడంతో కొద్ది అడుగులు వేసి తలత్రిప్పి చూశాను. ముగ్గుబుట్ట వంటి తలతో, కృశించిన శరీరంతో బస్సులో నా ముందు సీటులో కూర్చుని "కొడుకు జీతం రాగానే జూదమాడి, తాగి అంతడబ్బూ తగలేస్తాడు. ఆ డబ్బు కాస్తా చేజిక్కించుకోకపోతే నెలరోజులూ నేనూ, కోడలూ, పిల్లలూ పస్తులుండక తప్పదు" అన్న వృద్ధురాలు కనిపించింది.

నేను తలవంచుకుని త్వరత్వరగా నడిచాను. చీకటి, అంతటా కాన్సర్ వంటి చీకటి, లోకాన్ని తినేస్తున్నది. ఈచీకటి మహాసముద్రంలో అట్టడుగున ఎక్కడో వుండి వుంటుంది ఆ భయంకరమైన నీటిజంతువు. ఈ చీకటి ముద్దలవంటి గుడిసెలు భూమి మీద లేచిన భయంకర వ్రణాలవలె వున్నాయి. అవి యీ భూమిని కాన్సర్‌లా తినేస్తాయి. తప్పదు...

త్వరత్వరగా లైట్లతో నిండిన వీధిలోకి వచ్చాను. చల్లని గాలి విసురుగా వీస్తున్నది. ఆ గాలిలో తేమవల్ల నా గొంతులో మరింతగా మంట పుడుతున్నది. ఎక్కడో దూరం నుంచి విషాద గీతం ఏదో వినిపిస్తున్నది. రాత్రివేళల విహరించే ఏదో తెల్లని పక్షి రెక్కలల్లార్చుకుంటూ 'క్రీక్' మని అరుస్తూ ఎగిరి పోతున్నది.

సింహద్వారం దాటి లోపల మెట్లు ఎక్కబోతూ వుండగా బ్యాంకు గుమాస్తాగారి అమ్మాయి మామూలు ప్రకారమే నా చెప్పుల చప్పుడు విని కిటికీలో నుండి చూసింది. ఆమె వ్రేళ్లలో లావాటి పుస్తకం వుంది. ఆమె శ్రద్ధగా చదువుతున్నదా లేదా అని నాకు అనుమానం వచ్చింది. శ్రద్ధగా పుస్తకంలో లీనమై చదువుతూ వుండే పక్షంలో నా చెప్పుల చప్పుడు ఆమెకు వినిపించి ఆమె తలఎత్తి చూసే అవకాశం తక్కువ.

ఇంకా నేను మెట్ల మీద కాలు వెయ్యనేలేదు. అంతలో ఆప్రక్కగా చిన్న రేకుల షెడ్డులో అద్దెకుండే యాభై యేళ్ల స్త్రీ "ఇదుగో బాబూ, నిన్నే. ఇలా ఒక్కసారి రా నాయనా." అని పిలిచింది. ఆమె చేతిలో హరికేన్ లాంతరు వుంది. ఆ యింటివారు 'స్థలం నిరుపయోగంగా వుండడం ఎందుకూ?' అనే మీమాంసపడి ప్రహరీ గోడ మీదుగా నాలుగురేకులు వేసి మూడు వైపులా సిమెంటు రాళ్లతో గోడలు కట్టి దాన్ని రెండు భాగాలుగా చేసి రెండు కుటుంబాలకు అద్దెకిచ్చారు. ఒక్కొక్క గదికి నెలకు పదిహేను రూపాయలు మాత్రమే అద్దె. కరెంటులేదు. పిలిచిన ఆమె పేరు నాకు తెలియదు. వితంతువు. ఆమెకు, హైస్కూల్లో చదువుతున్న పన్నెండేళ్ల కొడుకు వున్నాడు. ఆమె నన్ను ఎందుకు పిలిచిందో నాకు తెలుసు. మునుపు కూడా ఒకసారి యిలాగే పిలిచింది. అయినా మళ్లీ వెళ్లాను. ఆమె నన్ను కూర్చోమని చెప్పి అలమారు నుంచి ఒక పెట్టె తీసింది. అందులో నుంచి ఒకపాత ప్రామిసరీనోటు యివతలికి తీసింది. అది నాచేతికిచ్చి "చూడు బాబూ, అతను తొందరలో డబ్బు యిస్తానన్నాడు. వడ్డీ లెక్కగట్టి మొత్తం ఎంత అయిందో లెక్కచూడు కొంచెం. నేను పెద్దదాన్ని. నాకేమీ తెలియదు మరి" అన్నది.

అవును. నీకేమీ తెలియదు. వాడెవణ్నో నమ్మి అయిదేళ్ల క్రిందట రెండువేల రూపాయలు, నీ భర్త మిగిల్చిపోయిన సర్వస్వం అప్పు యిచ్చి నోటు వ్రాయించుకున్నావు. మళ్లీ ఎన్నడూ చెల్లు కూడా వేయలేదు. వాడెవడో అప్పు తీర్చే బాపతుకాదు. నాకేమో ఏమీ తెలియదు.

నేను కాయితం మీద లెక్కలు వేస్తూ కూర్చున్నాను. ఒక మంచి అమాయకపు చేపను షార్క్ తింటున్న దనిపించింది.

చివరకు వడ్డీతో సహా లెక్క తేల్చి కాయితం మీద వ్రాసి యిచ్చి గొంతు సర్దుకుని "త్వరలో డబ్బు తిరిగి పుచ్చుకోండి. ఎవళ్లనూ నమ్మదగిన రోజులుకావు" అన్నాను.

ఆమె దిగులుగా మొహం పెట్టి "నిజమే నాయనా? కాని ఏం చెయ్యను?ఆయన్ను ఎన్నోసార్లు అడిగాను. 'ఇదుగో అదుగో' అంటూ గడుపుతున్నాడు. పైగా లేనివాడేమీకాదు కూడాను" అన్నది లాంతరు చూపుతూ. అప్పుడే ఆమె కొడుకు ప్రయివేటు

నుంచి కాబోలు తిరిగి వచ్చాడు. వాణ్ణి చూస్తే నాకు కొండంత జాలి వేసింది. పాపం! చిన్న చేపపిల్ల!

ఇరవై మెట్లు ఎక్కిన తర్వాత మలుపు తిరుగుతూ వుండగా దగ్గు ముంచుకువచ్చి ఉక్కిరి బిక్కిరి చేసింది. అక్కడ ఒక్క క్షణం ఆగి అలుపుతీర్చుకున్నాను. దగ్గు తెర తగ్గిన తర్వాత చూస్తే నోటికి అడ్డంగా పెట్టుకున్న రుమాలుమీద ఆ మంద మైన కొద్దిపాటి వెలుగులో నల్లని చార—బహుశా రక్త మేమో—కనిపించింది. రేపు డాక్టరు దగ్గరికి వెళ్ళాలి. ఆయన నన్ను కుర్చీలో కూర్చోబెట్టి సానుభూతి వర్షించే కళ్ళతోచూస్తూ ఇంజెక్షన్ యిస్తాడు. ఆ ద్రవ మేదో ఎర్రగా—రక్తంలాగే వుంటుంది. నేను ఆయనకుముందే చెప్పాను: "నే నెక్కడికీ యితర చోట్లకువెళ్ళి ఖరీదైన వైద్యం చేయించుకోలేను. మీరే అందుబాటులోవున్న వైద్యం చేయండి. తగ్గితే సరేసరి, లేదా......"

డాక్టర్ కళ్ళజోడు సర్దుకుంటూ "అవున్లే. నువ్వు చెప్పిందీ నిజమే. ఎక్కడికి వెళ్ళినా యిది తగ్గే రోగంకాదు. అనవసరమైన శ్రమా, దండగా ఎందుకు? నువ్వు మహా బ్రతికితే మాత్రం ఎన్నాళ్ళు?......" అన్నట్టు చూస్తాడు. ఆయన చూపులలో యితరు లెవరికీ యీ భావాలు కనిపించవు. నాకు మాత్రం ఆయన ప్రతి కదలికలోనూ, చూపులోనూ యిదే అర్థం కనబడుతుంది. ప్రవాహంలో మునిగిపోతూ కొట్టుకుపోతున్న వాణ్ణి దూరంగా గట్టున నిలబడినజనం ఎలా చూస్తారు? అవే చూపులు డాక్టరువి. కాకపోతే అలా మునిగిపోతూ చేతులు పైకెత్తి దణ్ణాలుపెట్టే స్వభావంకాదు నాది. హాయిగా మునిగిపోదాం! అనిపిస్తుంది. అలా మునిగిపోగలిగే అవకాశంమాత్రం ఎవరికి లభ్య మవుతుంది? అందులోనూ ఏదో చిత్రమైన ఆనందం ఉండి ఉండాలి.

తాళంతీసి లైటువేసి చాపమీద నడుం వాల్చాను. హఠాత్తుగా చాలా ఏళ్ళ క్రిందట జరిగిన విషయాలు గుర్తువచ్చాయి.

ఒకసారి నేనూ, మరో స్నేహితుడూ—బహుశా మధు సూదనమే అనుకుంటాను, అవును వాడే—యిద్దరమూ వూరికి దూరంగా రైలు కట్టవెంట నడుచుకుంటూ వెళ్ళాము. చాలాదూరం వెళ్ళాము. రైలుకట్టక్రింద గడ్డి బాగా ఒత్తుగా, ఎత్తుగా పెరిగివున్నచోట కూర్చుని ఉన్నాము. అప్పుడు మధు సూదనం—వా డా రోజులో పద్యాలు వ్రాసేవాడు—తను వ్రాసిన పద్యాలు హుషారుగా చదివి వినిపిస్తున్నాడు. చల్లని గాలి హాయి హాయిగా తెరలు తెరలుగా వీస్తున్నది. కాస్సేపట్లో పొద్దు గూక బోతున్నది. దూరంగా సూర్యుడు భయంకరంగా అస్తమిస్తు న్నాడు. హత్యచేసి పారిపోతున్నవాడి ముఖంలావుంది సూర్యబింబం. అప్పుడొక నడి వయస్సు వ్యక్తి మా దగ్గరికివచ్చి నిలబడ్డాడు. మధుసూదనం పద్యం చదవటం పూర్తిచేసి మరో పద్యం అందు కునే లోపుగా దగ్గి, "ఏమండీ!ఇప్పుడు బండి వచ్చే వేళఅయిందా?" అని అడిగాడు. మధుసూదనం చిరాకుగా, "ఎటునుంచి ఎటు పోతుందో తెలీదుగాని మొత్తానికి ఒక బండి వచ్చే వేళ అయింది" అని చెప్పాడు. "ఎటునుంచి ఎటు పోతేనేం? మొత్తానికి రైలంటూ ఒకటి వస్తుంది కదా!" అనుకుంటూ అతడు మా ప్రక్కన నిలబడి మధుసూదనం పద్యం చదువుతూవుంటే వింటూ ఆనందిస్తున్నట్టు కనిపించాడు. ఇంతలో దూరంనుంచి రైలు కూత అస్పష్టంగా వినిపించింది. ఆ వ్యక్తి ధ్యాస అంతా అటే ఉన్నట్టుంది. అతడు నెమ్మదిగా నడుస్తూ మానుంచి కొంచెం దూరంగా వెళ్ళాడు. మేము పద్యపఠనంలోనూ శ్రవణంలోనూ పీకలవరకూ మునిగిఉన్నాం. రైలు గుప్పు గుప్పున పొగ వదులుతూ రావడమూ, మాకు కొంచెం దూరంలో దారుణమైన చప్పుడుచేస్తూ ఆగిపోవ డమూ మేము ఆలస్యంగా గమనించాము. అక్కడ అంతా కోలా హలం, గందరగోళం. జనం రైల్లోనుంచి దిగి ఏమిటోచూస్తు న్నారు. పెద్దగా అరుస్తూ మాట్లాడుతున్నారు. మేము లేచి వెళ్ళి చూద్దుముకదా, అంతకుముందు మా ప్రక్కనే నిలబడివుండిన వ్యక్తి తలా మొండెమూ వేరుగా పడి ఉన్నాడు. నెత్తురుతో తడిసిన పట్టాల మధ్య రాళ్ళు అస్తమిస్తున్న సూర్యుడి కాంతులలో మరింత ఎర్రగా భయంకరంగా కనిపించాయి. మాకు కళ్ళు చెదిరిపోయాయి. ఇద్దరం దడదడలాడే గుండెలతో ఆ చోటు విడిచివెళ్ళాము. నే నంతకుముందుకుగాని, ఆ తర్వాత గాని ఎప్పుడూ మళ్ళీ అటువంటి దృశ్యం చూడలేదు. నీళ్ళలో మునిగిపోతున్నవాణ్ణి అసలు చూడలేదు. కేవలం వినడమే. నేను చాలాసార్లు వరవడి దినాలలో నదికి వెళ్ళేవాణ్ణి. జనం వేల సంఖ్యలో స్నానాలు చేస్తూ ఉంటారుకదా!

"ఏ ఒక్కడైనా పొరపాటున నీటి వేగానికి దూరంగా మున కలువేస్తూ కొట్టుకు పోకుండా ఉంటాడా? అప్పుడది చూడ టానికి ఎలా ఉంటుందో" అని లోలోపల అంతరాంతరాలల్లో పరమనీచమైన ఉత్కంఠ ఒకటి ఉండేది. కాని అలా ఎప్పుడూ జరగలేదు. అదీకాదు. చిన్నప్పటినుంచీ అటువంటి వెధవ కోరికలు చాలా ఉండేవి. నా లోపల ఎవడో మరొక సైతాను అంశలో పుట్టిన నికృష్టు డున్నాడనిపించేది. "ఇళ్ళు పెద్దసంఖ్యలో తగలబడుతూవుంటే చూడాలనీ, వరదలలో సమస్తమూ మునిగి కొట్టుకు పోతూవుంటే, భూకంపంవచ్చి అన్నీ కూలి పోతూవుంటే చూడాలనీ, అగ్ని పర్వతంలావాద్రవాన్ని ఫౌంటెన్‌లా చిమ్ముతూవుంటే చూడాలనీ....యిలాంటి కోరిక లుంటాయి వాడికి. నా లోపలివాణ్ణి అందుకే బ్రతక నివ్వకూడదు. వాణ్ణి షార్కులు చిత్రహింసకు గురిచేసి చంపాలి. వాణ్ణి కాన్సర్ తిని వెయ్యాలి. ఆ భయంకర సముద్ర జంతువు తన ఎనిమిది చేతు లతో ఒక్కుమ్మడిగా నలిపి వెయ్యాలి. అప్పుడు కాని నాకు సుఖం ఉండదు. కాని చిత్ర మేమిటంటే అవి వాడితోపాటు నన్ను కూడా అంతమొందిస్తున్నాయి.

## 4

నేను గదిలో కుర్చీలో కదలకుండా కూర్చుని ఉన్నాను. డాక్టరు ఎందుకో లోపలికివెళ్ళి యింకా రాలేదు. బహుశా అక్కడ మరొక రోగిని పరీక్ష చేస్తున్నాడేమో!

బల్లమీద అద్దం వుంది. అందులో నా ప్రతిబింబం నాకే చిత్రంగా కనిపించింది. కణతలమీద నరాలు ఉబ్బిఉన్నాయి. ఎర్రగా కందగడ్డలావుంది మొహమంతా.

మా స్నేహితు డొకడు—వాడిమధ్య ఎప్పుడో సముద్ర స్నానం చేస్తూ మునిగిపోయాడనీ, శవం కూడా దొరకలేదనీ అన్నా రెవరో—వాడు అప్పుడు శీర్షాసనం వెయ్యడం ప్రాక్టీసుచేస్తూ వుండేవాడు. చాలాసేపు అలా తలక్రిందులుగా వుండి తిరిగి మామూలుగా లేచి కూర్చునేసరికి యిలాగే వాడి మొహమంతా నెత్తురుతో నిండి ఎర్రగా రామములగపండులా తయారయ్యేది.

డాక్టరు వచ్చి కూర్చుని ''ఏం మిస్టర్! హౌ ఆర్ యు?'' అని అడిగాడు.

ఏం చెప్పను? ఏదో చెప్పబోయాను. కాని గొంతు మంట పుట్టింది. అంటే గడువు తీరుతున్నదన్నమాట.

ఆయన ''డోన్ట్‌వర్రీ'' అంటూ లేచివెళ్లి యింజెక్షన్ సిద్ధం చెయ్యడం ప్రారంభించాడు.

'రక్షించాడు' అనుకున్నాను. ఏమీ తినలేకుండా ఉన్నాననీ, గొంతు మంట దగ్గు విపరీతంగా ఉన్నాయనీ, నెత్తురు కూడా పడుతున్నదనీ, ఎలా చెప్పను? చెబితేమటుకు ఆయన ఏం చెయ్య గలడు? మరో సూది పోటు పొడస్తాడంతేగా? ఆ ఎనిమిది చేతుల జంతువును, నా దగ్గరికి రాకుండా చెయ్యడానికీ, ఆ కాన్సర్ నన్ను షార్క్‌లాగా తినివేయకుండా చూడటానికీ చాలినంత శక్తి గల మందు ఎవరు తయారు చెయ్యగలరు? ఆ షార్క్‌లకు వాసన తగిలితే యిక వాటిని ఎవ్వరాపగలరు?

డాక్టరు ఇంజక్షను యిస్తూ ఉండగా మా యింటి క్రింది భాగంలో అద్దెకుండే ఆసామీ గుర్తు వచ్చాడు. ఆయనకు కొంచెం తలనొప్పి వచ్చినా, వొళ్లు కొంచెం వెచ్చబడినా, యిక ఆ యింటిలో వారికే కాదు చుట్టుప్రక్కల వారికి గూడా గండమే. పెద్దగా కేకలు పెట్టి మూలిగి గందరగోళం చేస్తాడు. అమృతాంజనం మొదలుకుని సర్వౌషధాలూ తలా ఒకటి చొప్పున సప్లయి చెయ్యాలి. ఎవరే మందు చెప్పినా సరే తెప్పించుకుని మింగుతాడు. అలా రకరకాల టాబ్లెట్లు మింగుతూనే ''ఇకనేను బతకను''అంటూ అప్పగింతలు పెడతాడు. ఆ కాస్త తలనొప్పీ, జ్వరమూ తగ్గగానే మృత్యు ముఖంలో నుంచి తప్పించుకున్నవాడిలా ఇతరుల సానుభూతి పొందేందుకు మరింత నీరసం నటిస్తాడు. చుట్టుప్రక్కలవారందరూ ''పాపం, ఎంత జబ్బు పడి లేచాడు. ఇంకా నయం.... ఆ ఇల్లాలి మాంగల్యం గట్టిది కావడాన....'' అనుకోవాలని ఆయన తాపత్రయం. అదంతా ఏమోకాని ఆయన చేసే హడావిడికి ఆ యిల్లాలు ఎప్పుడో మంచాన పడటం ఖాయం.

డాక్టరు చేతిలో ఒక పది రూపాయల నోటు ఉంచి యివతలికి వచ్చాను.ఆ క్షణంలో ఆయన మొహం వంక చూసేందుకు నాకు మనసొప్పలేదు. ''పాపం! ఇతను డబ్బు యిస్తున్నాడే....'' అనుకుంటూ ఆ డాక్టరు చూసే చూపులు నేను భరించలేను.

ఆఫీసులో మా హెడ్ ఒక చిత్రమైన భంగిమలో కుర్చీలో కూర్చుని ఉన్నాడు. కొద్ది నిముషాలు ఆలస్యంగా వచ్చిన నావైపు అలాగే నిశ్చలంగా కూర్చుని చూశాడు.

''నాకు తగ్గని రోగం. అందువల్ల నేను ఎంత ఆలస్యంగా వచ్చినా, అసలు రాకపోయినా అలా మాత్రం చూడకండి'' అని నేను ఒక్కమాట అంటే చాలు. ఇక అలా చూడడు. కాని నాకు అలా అనడం యిష్టంలేదు, సరికదా ఆయన అలా నావంక చూడటం ఎందుకో యిష్టం. నాలోపలి నీచుడికి మరి అటువంటివే కదా యిష్టం.

నేను సీటులో కూర్చుని మళ్లీ ఆయన వంక చూశాను. ఆయన ఇంకా అలాగే కూర్చుని ఉన్నాడు. ఏం ఆలోచిస్తున్నాడో మరి.

నా రూములో పెట్టె అడుగున గుడ్డల మడతలలో ఎక్కడో ఒక ఫోటో ఉండాలి. అది నా చిన్నతనంలో ఎవరో కావలసినవారు ''తాతయ్య ఫోటో...'' అని చెప్పి యిచ్చారు. ఆ ఫోటోలో ఉన్నది మా తాతయ్య అవునో కాదో నాకు సరిగా తెలియదు. ఎందుకంటే మా తాతయ్యను నేను చూడ లేదు కాబట్టి. అయినా నేనా ఫోటోలో బొమ్మ మా తాతయ్యదే అనుకుంటూ ఉంటాను ఎప్పుడూ. అది చాలా పాతది కావడంవల్లనూ, ఎవరూ శ్రద్ధ తీసుకుని ఫ్రేము కట్టించక పోవడంవల్లనూ ఏవో పురుగులు కొట్టివేశాయి. అక్కడక్కడ సన్నని రంధ్రాలు పడ్డాయి. ఫోటోలో మా తాతయ్య నోటి మధ్యగా సరిగ్గా ఒక రంధ్రం ఉంది. కంఠంమీద మరొక రంధ్రం ఉంది. అది పెద్దది. ఇక చేతులనిండా కాళ్లనిండా చిన్నచిన్న చిల్లులు చాలా ఉన్నాయి. ఆ ఫోటో మా తాతయ్య చనిపోయిన తర్వాత కుర్చీలో కూర్చోబెట్టి తీయించారట. మృత్యువుతోపాటు మూసుకుపోయిన కళ్లను ప్రయత్నంమీద తెరిచిఉంచి కదలకుండా కుర్చీలో కూర్చోబెట్టి నోరు మూసి తీసి ఉంటారు ఆ ఫోటోను. కాని వెనక ఎవరో ఒకరు కన బడకుండా నిలబడి శవాన్ని పట్టుకున్నారేమోనని నా సందేహం. ఎందుకంటే ఆ కుర్చీ వెనుక క్రింది భాగంలో మనిషి కాలు అని భ్రమ కలిగించేదేదో కనిపిస్తూ ఉంటుంది.

ఇప్పుడది అంతా ఎందుకు గుర్తు వచ్చిందంటే మా హెడ్ సరిగా అదే భంగిమలో కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

ఆరోజు సాయంకాలం వరకూ పొడుగాటి అంకెలతో నిండిన కాయితాలతో వ్యవహరించి యివతలికి వచ్చి గుండెల నిండా గాలి పీల్చుకున్నాను. ఆ అంకెలను తలుచుకుంటే నాకు వానపాములూ, కోళ్లు ఏరుకుతినే చిన్నచిన్న పురుగులూ జ్ఞాపకం వస్తాయి. పైగా ఆ అంకె లన్నిటినీ కూడి లెక్కవేస్తూ ఉంటే ఎక్కడి కక్కడ లెక్క తెగిపోయి మళ్లీ పని అంతా మొదలుపెట్టవలసి వచ్చింది చాలాసార్లు.

ఒక హోటల్లోకి వెళ్లి కూర్చుని కాఫీ తెప్పించుకుని నెమ్మదిగా త్రాగుతున్నాను. చాలా నెమ్మదిగా ఒక్కొక్క చుక్క

చొప్పున త్రాగుతూ అద్దాలలోనుంచి వీధిలోకిచూస్తూ కూర్చున్నాను. అంతలోనే రోడ్డుమీద చిన్నప్రమాదం జరిగింది. ఆ రద్దీలో జనాన్ని, బండ్లనూ కార్లనూ తప్పించుకుని వేగంగా బాణంలా దూసుకుపోదామని ప్రయత్నించిన ఒకానొక యువక సైక్లిస్టు ఒక ఆటోరిక్షాను ఢీకొని గింగిరాలు తిరుగుతూ నేలమీద పడిపోయాడు. సైకిలు చక్రాలు వంకర్లు తిరిగి పోయాయి. అతడు పాపం వెంటనే లేచి చొక్కా లాగూల కంటిన దుమ్ము దులుపుకుని చుట్టూ చేరిన జనం వంక సిగ్గు పడుతూ చూస్తూ సైకిలు లేవదీసుకుని రోడ్డు ప్రక్కకు నడిచాడు. ఒకరిద్దరు వ్యక్తులు అతన్ని సాయంపట్టి హోటలు లోపలికి నడిపించుకు వచ్చారు. అతడు వారితో నెమ్మదిగా తనదే తప్పనీ, సైకిలు తొక్కడం కేవలం రెండు మూడు రోజుల క్రితమే నేర్చుకుని అంతలోనే రద్దీతో నిండిన వీధి లోకి రావడం పొరపాటేననీ, ఆ కంగారులో బ్రేకులు వేయడం కూడా మరిచిపోయాననీ అంటున్నాడు.

''అవును మరి'' అనుకున్నాను నేను. కాఫీ కొంచెం ఎక్కువగా గొంతులోకి దిగి ఒక్క క్షణం విపరీతంగా బాధ పడ్డాను. తర్వాత రుమాలుతో కళ్లు తుడుచుకుంటూ ఆ సైకిల్‌వాలా వంక చూశాను. నా కళ్లకు అతడు కొన్ని యేళ్ల క్రితం నే నెలా ఉండేవాణ్నో అచ్చంగా అలాగే కనిపించాడు. నేనా రోజులలో యిలాగే ప్రవర్తించేవాణ్ణి. ఒక పర్యాయము నేను ఈత కొట్టడంలో చాలా నిపుణుణ్ణనే భావం నా స్నేహితులకు కలిగించాను. ఎప్పుడో మాటల సందర్భంలో 'నేను గజ యీతగాణ్ణి' అనీ, 'రకరకాలుగా నీళ్లలో ఈదగలను' అనీ అబద్ధాలు చెప్పాను. ఎందుకు అలా చెప్పానో తెలియదు. పైగా నాకు నీళ్లంటే అపరిమితమైన భయం. ఎప్పుడైనా నీళ్లలో దిగవలసి వస్తే 'అక్కడ ఎంత లోతు ఉందో ?' అనీ 'లోపల జలగలు మొదలైన క్రూర జల జంతువు లేవైనా ఉన్నాయేమో' అనీ అనిపించి నరాల్లో వొణుకు పుట్టుకు వచ్చేది. అటువంటి నన్ను అందరూ 'ఈతలో ఎక్స్‌పర్టు' అనుకుంటూ ఉండేవారు. కాని ఒకసారి పులితోలు కప్పుకున్న మేక అసలు స్వరూపం బయటపడింది. నలుగు రయిదుగురు స్నేహితులతో కాలవకో, నదికో బయలుదేరి వెళ్లవలసి వచ్చింది. వా రందరూ నీళ్లలో దిగి ఈతలు కొడుతూ ఉంటే నేను వొడ్డునే నిల బడ్డాను. కాని వారు నన్ను కూడా దిగి రమ్మని గోల చేశారు. 'నాకు జలుబు చేసింద' నీ, 'తల నొప్పిగా కూడా ఉంద' నీ, 'ఒడ్డునే ఉండి వారి దుస్తులు చూస్తూ ఉంటాననీ' చెప్పాను. వారు నా మాటలు విన్పించుకోలేదు. ఒకడు ''చేతులూ కాళ్లూ కదల్చకుండా నీళ్లమీద తేలుతూపోవడం నాకు నేర్పు'' అంటున్నాడు. ఇక నాకు దిగక తప్పలేదు. లోపల ఒక భరోసావుంది. కొంతసేపటినుంచీ వారందరూ నీళ్లలో యీదులాడుతూవుంటే చూశానుకదా! 'ఇంతేకదా' అనిపించింది. 'అదేమీ బ్రహ్మ విద్య కాద'ని కూడా అనిపించింది. ఆ కదలికలూ, ఒడుపులూ అన్నీ గుర్తు పెట్టుకున్నాను. 'నీళ్లలో దిగి మనమూ అలాగే చేతులూ కాళ్లూ కదిలిస్తే సరి' అనుకున్నాను.

తీరా నీళ్లలోకి దిగుతూవుండగా భయం కలిగింది. కాళ్లు అందనంత లోతుకువెళ్లి కాళ్లూ చేతులూ తపతప ఎంతగా విదిలించినా లాభం లేకపోయింది. పైగా గొంతులోకి నీళ్లు కూడా పోయి క్రింద కాళ్లు ఆనని కారణంగా గుండెల్లో దడ బయలుదేరింది. మునకలు వేస్తూ పెద్దగా చావు కేకలు పెట్టాను. వాళ్లందరూ గాభరాపడి నన్ను జుట్టు పట్టుకుని ఒడ్డుకు లాక్కువచ్చి పడేసి తర్వాత ఒకటే నవ్వడం. అప్పటి నా వాలకంలాగే ఉంది, యీ సైక్లిస్టు యువకుడి వాలకం కూడా....

బిల్లు చెల్లించి హోటలు బయటికివచ్చి పేవ్‌మెంట్ మీద నడుస్తున్నాను. బస్సు స్టాప్‌కు యింకా కొద్ది గజాల దూరంలో ఉండగానే వెనకనుంచి ఫైర్ ఇంజన్లు మ్రోగిస్తున్న గంటలు చెవులు చిల్లులు పడేట్టు వినిపించాయి. జనం అందరూ రోడ్డుమీద ప్రక్కకు తప్పుకుని దోవయిచ్చి నాలుగు వైపులా చూడటం ప్రారంభించారు.

నేనూ ఉత్కంఠతో తల నాలుగు వైపులా తిప్పిచూశాను. అదుగో! ఆ వైపున పొగ చుట్టలు చుట్టలుగా పైకి లేస్తున్నది. గచ్చకాయ రంగులోవున్న పొగ మధ్యగా ఎర్రని మంటలు వ్యాపిస్తున్నాయి. దాదాపు పరుగెత్తుతున్నంత వేగంగా అడుగులు వేశాను.

ఇళ్లు తగలబడుతున్న దృశ్యం పెద్ద నగరాలలోచూస్తే మనం వున్నచోటికి చాలా దగ్గరగా ఉన్నట్టు అనిపిస్తుంది. ఆ ప్రదేశం మైళ్లకొద్దీ దూరంలోవున్నాసరే మన పరిసరాల్లోనే అనిపిస్తుంది. ఇప్పుడూ అంతే అయింది. 'ఇక్కడే.....ఇక్కడే' అనుకుంటూ దాదాపు అరమైలు దూరం నడవవలసివచ్చింది. నా వెనకనే ఒక సన్నటి వ్యక్తి ఉరుకులు పరుగులుగా ఒగర్చుకుంటూ వస్తున్నాడు. ఏదో వర్క్‌షాపులోనుంచి చేస్తున్న పని అలాగే ఒదిలేసి పరుగెత్తి వస్తున్నాడు కాబోలు అతని చేతుల నిండా, దుస్తులనిండా నల్లని మసి.

తీరా అక్కడికి చేరుకునేసరికి ఆ వేడిమికి కమిలిపోతానేమోననిపించింది. వరుసగా చాలా గుడిసెలు బుగ్గిపాలయిపోయాయి. బూడిద కుప్పలుగా మిగిలిపోయాయి. ఇంకా కొన్ని తీరికగా నిలబడి కాలుతున్నాయి. ఆ పాకలలో అంతవరకూ తల దాచుకుంటూ వచ్చిన పిల్లామేకా, ఆడా, మగా, అంతా కొందరు భయంగా చూస్తూనూ, మరికొందరు శోకాలు పెడుతూనూ రోడ్డుమీదే పడి ఉన్నారు.

ఫైర్ సర్వీసువారు మంటలతో పోరాడుతూనే ఉన్నారు. అయినా అట్టే ప్రయోజనం కనిపించడంలేదు. అగ్నిదేవుడు వాయుదేవుడితో స్నేహం కట్టి తన జ్వాలాజిహ్వలు చాచి అన్ని వస్తువులనూ, యిదీ అదీ అనే వివక్షత లేకుండా బంగారం మొదలుకుని, బ్రతుకు బరువును మోస్తున్న బీదసాదల శరీరాలవంటి శుష్కించిన వెదురు బొంగుల వరకూ సర్వస్వాన్నీ కాల్చి కబళించి వేస్తున్నాడు. లోతైన సముద్రాలలోని ఆ ఎనిమిది చేతుల భయంకర జంతువు విజృంభించి సమస్తాన్నీ మింగుతున్నట్టున్నది.

నేను ఆ జనంలో ముందుకు నడిచి వెళ్లాను. మూడు కాళ్ల ముదుసలులూ, కళ్లు తెరవని పసిగుడ్డులూ, ఆడవాళ్లూ, అవులూ, గేదెలూ, నులక మంచాలూ, చాపలూ, పక్కగుడ్డలూ, మట్టికుండలూ, శోకాలు పెట్టేవారూ, 'అయ్యో! ఇక ఎలా బ్రతకడం' అని అంగలార్చేవారూ, "ఇలా ఎందుకు జరిగింది అసలు?" అని ప్రశ్నలు వేసేవారూ, అంతా సంతలావుంది. కొందరు పత్రికా విలేఖరులు కాయితాలూ, పెన్సిళ్లూ పట్టుకుని సమాచారంకోసం జనంలో తిరుగుతున్నారు. పోలీసులు బెత్తాలు పుచ్చుకుని కాపలా కాస్తున్నారు.

నా లోపలి సైతాను అంశలో పుట్టిన దుష్టుడికి ఇదీ అని చెప్పరాని ఒక పొంగు వచ్చినట్టుంది. ఆదుర్దాతో అందరి దగ్గరికీ వెళ్లి వారు మాట్లాడుకుంటున్నది వింటూ, అటూ యిటూ తిరుగుతూ ఉండిపోయాను. ఫైర్ సర్వీసువారు యింకా కాలుతున్న ఒక పెద్ద నాలుగు నిట్రాళ్ల గుడిసె మీదికి నీళ్లు చిమ్ముతున్నారు. ఒకచోట ఒక చిన్న గుడిసెవుంది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, గాలివాలువల్లనో, ఆ గుడిసె స్వంతదారుల అదృష్టంవల్లనో చుట్టూ వున్న అన్ని గుడిసెలు తగలబడి బూడిదగా మిగిలిపోయినా ఆ గుడిసెకు మాత్రం నిప్పు అంటుకోలేదు.

నేను ఆశ్చర్యం పైకి వెలిబుచ్చుతూ, "ఈ గుడిసెకు నిప్పంటుకోలేదేం?" అని అడిగాను. నా ప్రశ్నలో ఏదురర్థం స్ఫురించిందో మరి అక్కడివారు కొందరు నన్ను వింతగా చూశారు. నేను వెంటనే యివతలికి వచ్చేశాను. ఎట్టకేలకు మంటలు అదుపులోకి వచ్చాయి. జనం కొందరు తమ తమ గుడిసెలుండవలసినచోట ఏమేమి మిగిలాయో చూచుకునేందుకు వెడుతున్నారు.

నేను నడుస్తూ ఉండగా రోడ్డుప్రక్క కూర్చునివున్న ఆ వృద్ధురాలు కనిపించింది. మొహంచూస్తే అంతవరకూ ఏడ్చి శోకాలు పెట్టిందేమోననిపించింది. ఆ ప్రక్కనే పసిపిల్లకో—పిల్లవాడికో పాలిస్తూ కూర్చునివున్న యిరవై అయిదేళ్ల యువతి ఆమె కోడలై ఉండాలి. మరో యిద్దరు పిల్లలు పక్కనే దిస్స మొలలతో నిలబడి ఉన్నారు. వారిలో పెద్దవాడు బెరుకుగా, భయంగా, చూస్తున్నాడు. చిన్నవాడు నోట్లో వేలు వేసుకుని చీకుతూ కళ్లు పెద్దవి చేసుకుని సంతలో విచిత్రాలు చూస్తున్న వాడిలా నిలబడి ఉన్నాడు. ఆ త్రాగుబోతు నగరంలో ఆ మూల ఎక్కడో ఫౌండ్రీలో పని చేస్తున్నాడు కదా, వాడు ఎప్పుడో రాత్రి పొద్దుపోయిన తర్వాత యిక్కడికి చేరుకుంటాడు. అతనికీలోపల యీ విషయం తెలిసే అవకాశంలేదు. తీరా అప్పుడు వచ్చి ఈ దృశ్యం చూసి కొయ్యబారిపోతాడు కాబోలు!

"ఇక ఎలా బ్రతకడం?" అనుకుంటున్నది ఆ వృద్ధురాలు. అవును......ఎలా బ్రతుకుతావు? నీ కొడుకు తన సంపాదన అంతా త్రాగుడుకూ, జూదానికీ తగలేస్తాడు. నువ్విన్నాళ్లూ వాడు దయతలిచియిస్తే తిన్నావు. లేకపోతే పస్తులే ఉన్నావు. తిన్నావో తినలేదో, వచ్చి మంచి నీళ్లే తాగి కోడలూ, పిల్లలతో పస్తులే ఉన్నావో, మొత్తానికి అందర్నీ కడుపులో పెట్టుకుని ఆ గుడిసెలో ముడుచుకుని పడుకున్నావు. ఇప్పుడా గుడిసె నిప్పుల పాలయిపోయింది. ఇక ఏం పెట్టి మళ్లీ యిల్లు వేసుకుంటావు?

నేను తిరిగి వచ్చేస్తూవుంటే ఆకలి విపరీతంగా బాధించడం ప్రారంభించింది. త్వరత్వరగా నడిచాను. లైట్ల వెలుగులో నగరం ఉజ్జ్వలంగా తళతళా మెరుస్తున్నది. ఎక్కడ చూసినా నియోన్‌లైట్ల కాంతులూ, ఖరీదైన కార్లూ, స్కూటర్లూ, వాటి వెనక సీట్లలో అందమైన ఆడవాళ్లూ, షోరూములూ కనిపించి కళ్లు మిరుమిట్లు గొల్పుతున్నాయి. నేనెప్పుడో—డాక్టరు మాట ఆయనఅనుకున్నట్టు ఫలించి 'త్వరలో అంతా సర్దుకుంటే'—స్కూటర్‌మీద దూసుకుపోతూ వుంటే ఆ వెనకసీటులో రెండు చేతులతో నన్ను గట్టిగా పట్టుకుని కూర్చోబోయే ఆ తలోదరి ఎవరు?

హోటలు మరో వంద గజాల దూరంలో వుంది. అప్పుడు గొంతులో మంట ప్రారంభం అయింది. ఓర్పుగా గొంతు రుద్దుకుంటూ దగ్గు ఆపుకుంటూ నడక సాగించాను నేను.

భోజనం కూడా నాకు చాలా చికాకు కలిగించింది. అంతా కారం మయం. ముద్ద నోట పెడితే కళ్లవెంట నీళ్లు తిరిగాయి. అలాగే ఓపికగా ఒట్టి అన్నం నాలుగు ముద్దలు మింగి చేతులు కడుక్కుని బయట పడ్డాను. ఆ క్షణంలో నాకు ఎవరి మీదో, ఎందుకో తెలియని కసీ ఉక్రోషమూ పొంగివచ్చాయి.

చీకట్లో నడుస్తూ వుంటే కళ్లవెంట యింకా నీళ్లు రావడం మానలేదు. వెనక ఎవరివో అడుగుల చప్పుడు వినిపించి వెనుదిరిగిచూస్తే రత్నావళి చేతిలో పుస్తకాలతో హంసలా నడిచిపోతూ కనిపించింది. నన్ను చూచే ఉంటుందా? ఏమో మరి!

సింహద్వారం దాటి మెట్లు సమీపించి మామూలుగానే బ్యాంకు గుమాస్తాగారి భాగం వైపు చూశాను. ఆయన కూతురు కూడా రోజూవలెనే లావాటి పుస్తకం ఒళ్లో పెట్టుకుని చదువుకుంటున్నదల్లా చెప్పుల చప్పుడు విని కిటికీలోనుంచి తల యివతలకిపెట్టి చూసింది. నాకు మామూలుగానే "ఆమె శ్రద్ధగా చదువుతున్నదా, లేదా?" అని అనుమానం కలిగింది.

ఈ వేళ పద్దెనిమిది మెట్లు, ఎక్కగానే దగ్గుముంచుకుని వచ్చి నన్ను మెలికలు తిప్పివేసింది. నోటి కడ్డంగా ఉంచుకున్న రుమాలులో మళ్లీ నల్లని చార కనిపించింది. నెమ్మదిగా మిగిలిన మెట్లు ఎక్కాను. పైకి చేరుకోగానే చల్లని గాలి విసురుగా ఒంటికి తగిలింది. వరప్రసాద్ క్యాంపుకు వెళ్లాడో ఏమో, అతని రూముకు తాళం వేసివుంది.

నేను తలుపుతీసి లైటు వెలిగించి ఆశ్చర్యపోయాను. నా గదిలో గుమ్మం ప్రక్కనే నేలమీద ఉత్తరం! దాన్ని వెంటనే చేతుల్లోకి తీసుకోకుండా దుస్తులు మార్చుకుంటూ 'చాలా' ఆలోచించాను. నాకు 'నా' అనుకోదగిన వారెవరూ లేరు. మిత్రు

లైనా మధుసూదనం తప్పించి చెప్పుకోదగిన వారెవరూలేరు. నన్ను డాక్టరు దగ్గిరికి తీసుకువెళ్లిన ప్రసాద్ నాకు మంచి మిత్రుడేగాని అతనికి నే నుంటున్న యీ కొత్త అడ్రసు తెలియదు. పైగా మధుసూదనమూ, ప్రసాదు యిద్దరూ తరచుగా జాబులు వ్రాసే అలవాటున్నవారుకాదు. "సరే. చూస్తే తెలుస్తుందిగా" అనుకున్నాను.

వంగి పరీక్షగా చూస్తూ ఆ కార్డును చేతిలోకి తీసుకున్నాను. ఎక్కువగా చదువుకోని ఆడపిల్ల దస్తూరీ. తీరా వెనకవైపు చూస్తే ఆ అడ్రసు నాదికాదు. కృష్ణమూర్తి అనే పేరుగలవారు నాకు తెలిసినంతల ఎవరూలేరు. పోస్టుమేన్ పొరపాటున దీన్ని యిక్కడ పడేసి వెళ్లి ఉంటాడు. —దాన్ని అవతల ఒక ప్రక్కగావుంచి నడుం వాల్చాను. నా లోపలి నీచుడు 'ఆ ఉత్తరం చదువుదాం' అని గోల చేస్తున్నాడు. నేను వాడి నోరు నొక్కేందుకు మరే యితర మార్గమూ లేక గొంతెత్తి బాధను అణుచుకుంటూనే "ఆపలేనే ఎంకి" అని పెద్దగా పాడటం ప్రారంభించాను. గదిలో నా కంఠస్వరం నిండుగా నిండిపోయి ప్రతిధ్వనించింది. అంతలో బయట అడుగుల చప్పుడు వినిపించింది. ఎవరో పిలిచినట్టు అయింది. పాట ఆపి లేచి చూద్దామనుకదా, ఆ హిందూస్తానీ వ్యక్తి నిలబడి ఉన్నాడు. అకస్మాత్తుగా, రెండో అంతస్తులో కాపురంవుండే భాగం కాక పైన మరో రెండు గదులు కూడా అతని అధీనంలోనే ఉన్నాయనే విషయం గుర్తుకు వచ్చింది.

అతడు కోపంగా చూస్తూ, "మిష్టర్! మీరు యింత రాత్రివేళ యిట్లా పెద్దగా పాటలు పాడుతూ మమ్మల్నెందుకు బాధ పెడతారు? అంత 'యిది'గా వుంటే ఎక్కడైనా కచేరీ చేసుకోండి. మమ్మల్ని చంపకండి" అన్నాడు. అతడొకప్పుడు ఎవరితోనో "ఇంట్లో రేడియోవుంటే పెద్ద న్యూసెన్సండీ.....గోల....." అంటూ ఉండగా విని జాలిపడ్డాను. ఇంట్లో సూదికూడా క్రింద పడరాదనీ,ఎవరూ పెదవి కదపరాదనీ, అతని శాసనం. ఇప్పు డతని మాటలు విన్న తర్వాత నాకు ఒళ్లు మండింది. అతని మాటలధోరణిచూస్తే అరికాలిమంట నెత్తి కెక్కింది. అసలే కసిగా ఉన్నానేమో ఒత్తి ఒత్తి పలుకుతూ స్పష్టంగా చెప్పాను.

"అయ్యా! ఇది నా రూము. దీనికి నే నొక్కణ్ణే అద్దె యిచ్చుకుంటున్నాను.నేను ఈ నాలుగుగోడలమధ్య పాడుకుంటాను. మరీ సరదా పుడితే భరతనాట్యం కూడా చేస్తాను. ఎవరూ ఆక్షేపించకూడదు. ఇకమీదట ఇలా నా రూముముందు నిలబడి రచ్చచేస్తే మర్యాదగా ఉండదు."

అతని మొహం కందగడ్డలా ఎర్రబడటం స్పష్టంగా చూశాను. ఏమీ చెయ్యలేక కోపంగా నిప్పులు చెరుగుతూ చూసి "దట్సాల్‌రైట్" అంటూ కసిగా తల వూపుతూ వెళ్లిపోయాడు.

—నేను తలుపులు మూసి పక్కమీద నడుం వాల్చి సంతృప్తిగా కళ్లు మూసుకున్నాను. అయితే మళ్లీ పాడుకోవాలనిపించలేదు నాకు. ఆ మేరకు అతడే విజయం సాధించాడనుకోక తప్పదు. ఇక పిక్నిక్‌లోనే నేను గొంతు ఎత్తటం. అదే యిక చివరిసారి అవుతుందేమో!

అలానిశ్శబ్దంగా కాస్సేపుగడిచేసరికి నాలోపలిఅక్షుద్రుడు విజృంభించాడు. నేను ఆ ఉత్తరం చేతుల్లోకి తీసుకున్నాను. పైన వూరిపేరుగాని తేదీగాని లేవు. ఉత్తరంక్రింద 'సుజాత' అని సంతకం వుంది. నా చూపులు ఉత్తరంలోని పంక్తులవెంట పరుగులెత్తాయి.

"ప్రియమైనఅన్నయ్యకు మీచెల్లెలు నమస్కారములు. ఇక్కడ నేను, తమ్ముడు క్షేమం. నీవు ఉద్యోగంలో చేరేందుకు వెళ్లిన వెంటనే వ్రాసిన ఉత్తరంతప్ప ఇన్నాళ్లు గడిచినా నీవద్దనుంచి ఉత్తరం రాలేదు. ఆ ఉద్యోగంలో సెలక్టు కాలేదనీ, మరెక్కడో ప్రయత్నిస్తున్నాననీ వ్రాశావు. నాకు మిక్కిలి అదుర్దాగా ఉన్నది. నీవు త్వరలో డబ్బు పంపుతానని చెప్పి వెళ్లావు. ఇంతవరకూ ఎందుకని పంపలేదు? ఇక్కడ యింటి చుట్టూ అప్పులు చేశాను. ఇక అప్పు దొరుకేటట్లు లేదు. మిక్కిలి యిబ్బందిగా ఉన్నది. నీ మీదనే అన్ని ఆశలూ పెట్టుకున్నాను. నాన్నా, అమ్మా అందరూ పోయినా నిన్ను చూసుకునే నేనూ తమ్ముడూ జీవించి ఉన్నాము. ఈ ఉత్తరము చేరగానే దీనిని టెలిగ్రాముగా భావించి వెంటనే జవాబు వ్రాయవలసినది. నీ జవాబు వచ్చేవరకూ నాకు మనశ్శాంతి ఉండదు. ఇట్లు నీ చెల్లెలు, —సుజాత."

పోస్టుఆఫీసు ముద్రలో వూరి పేరు కనుక్కుందామని ప్రయత్నించాను. కాని లాభం లేకపోయింది. ఆ ముద్రలో అక్షరాలు స్పష్టంగా కనిపించడంలేదు. నిట్టూర్చి ఆ ఉత్తరం అవతల పడేసి కళ్లు మూసుకున్నాను. ఒక చిన్న యిల్లూ, అయ్యవార్లంగారి నట్టిల్లులా అన్నీ నిండుకున్న ఆ యింటిలో ఏమీ తోచక శోకదేవతలా కూర్చునివున్న ఒక పడుచూ, ఆ పక్కనే "అక్కా ఆకలి" అంటూ గోల చేస్తున్న ఒక పసివాడూ..... ఇదీ కళ్లకు కట్టిన దృశ్యం......

## 5

ఆ రాత్రి.......

నాకు కంటిమీదికి కునుకు రాలేదు.

ఉక్రోషంతో, నిస్పృహాయుడనై, పక్కమీద అటూ, యిటూ దొర్లుతూ వుండగానే మూడు వంతుల రాత్రి గడిచిపోయింది. కళ్లు మూసుకుని నిద్ర పట్టించు కుందామని చాలా సేపు విఫల ప్రయత్నం చేసి చివరకు తలుపు తీసుకుని బయటికి వచ్చాను. ప్రక్క గదిలో వరప్రసాద్ యింకా క్యాంపు నుంచి రాలేదు.

ఆరుబయట మంచు తీవ్రంగా కురుస్తున్నది. ఆకాశంలో బాగా ప్రకాశించే పెద్ద నక్షత్రాలు కొన్ని మినహాయిస్తే, మిగిలినవన్నీ, పలుచని సిల్కు గుడ్డ మడతలలో దాచి వుంచబడిన బుల్లి బుల్లి ముత్యాలవలె మెరుస్తున్నాయి.

నేను పిట్టగోడ కానుకుని చేతులు కట్టుకుని నిలబడ్డాను. అలా చాలా సేపు నిలబడ్డట్టున్నాను. ఆ తేమగాలి మూలంగా దగ్గు ముంచుకు రాగానే అప్పుడు హఠాత్తుగా స్పృహ వచ్చినట్టయి త్వర త్వరగా గదిలోకి వెళ్లాను. దోవ పొడుగునా దగ్గుతూనే వెళ్లి పక్కమీద వాలిపోయాను. దగ్గు, ఆ భయంకర సముద్ర జంతువులా, నన్ను లొంగ దీసుకొని కొద్ది నిముషాల సేపు ఉక్కిరి బిక్కిరి చేసింది. క్రిందటి రోజువలెనే రుమాలు మీద మరింత పెద్ద చార పడింది. ఆ తర్వాత ఎంతో సేపటికి ఆ ఉధృతం తగ్గింది. ఆ ఎనిమిది చేతుల భయంకర జంతువు తన చేజిక్కిన ఎర అలసిపోయిందన్న సానుభూతితో తన పట్టు కొంచెం వదులు చేసింది. అంతలో నా కళ్లు మూతలుపడ్డాయి.

తలుపుమీద చప్పుడూ, ఎవరో పిలుస్తున్న వైనమూ నన్ను మేల్కొలిపాయి. నెమ్మదిగా లేచి ఒళ్లు విరుచుకుని తూలుతూ వెళ్లి తలుపు తీశాను. రామమూర్తి హడావిడి పడుతూ కనిపించాడు.

—అతడు నన్ను చూసి కంగారు పడ్డట్టున్నాడు. నేను "మీరా.....రండి....." అంటూ తలుపులు బార్లగా తెరిచాను.

అతడు లోపలికి వొస్తూనే "ఇదేమిటి? మీ రిప్పుడా నిద్ర లేవడం? నిన్న మళ్లీ గుర్తు చేద్దామనుకుంటే, ఏదీ, మీరు ఆఫీసుకు రాకనేపోతిరి. అసలేమిటి సంగతి? మీకు ఒంట్లోగాని నలత ఏమీ లేదుకదా?" అన్నాడు.

నేను కిటికీలోనుంచి లోపల పడుతున్న ఎండ వంక చూశాను. బాగా పొద్దెక్కినట్టున్నది.

"ఒంట్లో బాగానే ఉంది....." అంటున్నాను నేను. మళ్లీ అతడుఅంతలోనేతొందరపడుతూ, "మీరు తొందరగా తయారు కావాలి. అవతల అందరూ మనకోసం కనిపెట్టుకుని ఉంటారు. బస్సు సిద్ధంగా ఉంది నేను మీకోసం బయలుదేరి వచ్చేటప్పటికి. మీదే ఆలస్యం....అసలు మీ వరస చూస్తే పిక్నిక్ విషయం మీకు అసలు గుర్తున్నట్టేలేదు..... అయ్యో! ఇలాగయితే ఎలాగండీ మరీనూ" అని గును స్తూనే ఉన్నాడు. నేను నా పనులు కానిస్తూనే అతని మాటలు విన్నాను. తర్వాత "అయిదు నిముషాల్లో బయలు దేరకపోతే అప్పుడు మీ యిష్టం వచ్చినట్టు అనండి" అంటూ క్రిందికి దిగి వెళ్లాను. నాకు అతడు చాలాసార్లు చెప్పాడు. పైగా రెండు రోజుల క్రితం కూడా నా దగ్గర చందా వసూలుచేస్తూ "మీ పాట ప్రోగ్రాంలో మొదటి అయిటం" అంటూ గుర్తు చేస్తే నాకు విసుగు కలిగింది.

అన్ని కార్యక్రమాలూ చాలా త్వరగా ముగించుకుని దుస్తులు వేసుకుని 'రెడీ' అన్నాను. అతడు ముళ్లమీదకూర్చున్న వాడిలా అంతవరకూ అసహనంగా కూర్చుని అప్పుడు బంతిలా లేచి వాచీ చూసుకుని "భలే మంచివారండీ మీరు......" అన్నాడు. గదికి తాళం వేసి మెట్లు దిగుతూ ఉండగా అతడు, "అన్నట్టు చాలాసార్లు అడుగుదామనుకున్నాను. మీరీ మధ్య హుషారుగా లేరు.....ఏమిటి సంగతి?" అని అడిగాడు.


పట్టు చీరెలు

మావద్దనే

ఎందుకు కొనాలి

?



సరసమైన ధరలు
నాజూకైన డిజైనులు
మెరిసే రంగులు
ధరించుటకు మృదుత్వమును
హాయిని గొల్పునది

లక్ష్మీ జనరల్ స్టోర్సు

ఫోను 467

బీసెంటు రోడ్డు...... గవర్నరుపేట,
విజయవాడ-2.

"ఏమీ లేదు. ముందు మీరు త్వరగా నడవండి" అన్నాను నేను. మెట్ల మధ్యలో మాకు రాజేంద్ర పైకి ఎక్కి వస్తూ ఎదురుపడ్డాడు. మేము వెళ్లేసరికి అందరూ మా రాక కోసమే ఎదురు చూస్తున్నట్టున్నారు. బస్సు సిద్ధంగావుంది. లోపల మా సహోద్యోగులూ, నలుగురు సహోద్యోగినులూ కూర్చుని ఉన్నారు. బస్సు వెనక ఖాళీలో ఏవేవో తిను బండారాలతో నిండిన పాత్రలు సర్ది ఉంచారు. మే మిద్దరమూ ఎక్కగానే బస్సు ఒక్క కుదుపుతో బయలు దేరింది.

అందరూ హుషారుగా ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. నా ఒంటరితనం మళ్లీ నన్ను ఉక్కిరి బిక్కిరి చేయడం ప్రారంభించింది. ఆదిగులుమరిచిపోయేందుకు చూపులుమళ్లించుకున్నాను. కొండ పక్కగా మెలికలు తిరిగిన ఆ రోడ్డువంకా, ఎర్రని రాళ్లు ఎప్పుడు క్రిందికి దొర్లుతాయో అనిపించే ఆ కొండవంకా చూస్తూ కూర్చున్నాను. అంతలో నా కో అనుమానం వచ్చి శరీరం కొంచెం జలదరించింది. రోడ్డుకు ఒక ప్రక్కన కొండ, రెండో వైపున లోతైన లోయ. ఆ రోడ్డు వెంట యున్ని ప్రాణాలను తన గుప్పిటలో వుంచుకుని డ్రైవరు బస్సును సునాయాసంగా వేగంగా నడుపుతున్నాడు. అతని పద్ధతిలో నాకు నిర్లక్ష్యం కూడా గోచరించింది. "ఎక్కడ ఏ 'స్క్రూ' ఒదులయినా, ఏ 'బోల్టు' ఒదులయినా పెద్ద దారుణం జరుగుతుంది. అలా జరిగిన మరుక్షణంలో అందరం ఆ లోతైన లోయలో పడి కిక్కురుమనకుండా దిక్కులేని చావు చావడం ఖాయం......నేను ఈతరహాఆలోచనలను అరికట్టే ఉద్దేశంతో దూరంగా ఆకాశం వంకా, అంతలోనే ఆకృతులు మార్చుకుంటున్న మబ్బుల వంకా, అక్కడొకటీ, అక్కడొకటిగా ఎగురుతున్న ఏవో పక్షులవంకా చూస్తూ కూర్చున్నాను. అయినా నాలోపలి క్షుద్రుడి నోరు మూయడం నా తరమా?

ప్రక్కనేవున్న రామమూర్తి వంక తిరిగి అనకూడదనుకుంటూనే అన్నాను.

"ఇప్పు డీ బస్సులో ఏ స్క్రూ ఒదులయినా, ఏ బోల్టు వూడినా, గోవింద......అ లోయలోపడి మచ్చుకు కూడా మిగలకుండా పోతాంకదూ? అయినా నలుగురితో చావుమాత్రం కోరుకున్నంతలో దొరుకుతుందా?"

తీరా ఆ మాటలు అన్న తర్వాత నేను ఆశ్చర్యంతో తలమున్కలైనాను. నా లోపలి ఆ పశువు నామీద యింత అధికారం సంపాయించినందుకు నాకు దిగ్భ్రమ కలిగింది. రామమూర్తి నా మాటలు విని కళ్లు పెద్దవి చేసుకుని నావంక కనురెప్ప వాల్చకుండా కొద్ది క్షణాలు చూసి "శుభం పలకరా అంటే" అన్నట్టు ఏమిటండీ ఆ మాటలు? మీకు "వేపకాయంత వెర్రిగాని లేదు కదా?" అన్నాడు.

నా ముఖం ఎర్రబడి ఉండాలి. నవ్వడానికి ప్రయత్నించి తల త్రిప్పుకున్నాను. అరగంట తర్వాత అంతకుముందే నిర్ణీతమైన ప్రదేశంలో దిగాము. అక్కడ అంతా హాయిగావుంది. చల్లని చెట్లు సూర్యుని ఎండను భూమిమీద పూర్తిగా పడనివ్వడంలేదు. ఆ కొమ్మల, ఆకుల సందులలోనుంచి నేలమీద పడుతున్న వెలుగు, గుండ్రంగా లెక్క లేనన్ని సున్నాలు గీసినట్టున్నది. పక్కనే కొద్ది గజాల దూరంలో తామర ఆకులతో దట్టంగా కప్పబడిన చక్కని కొలను ఉన్నది. అక్కడ రకరకాల పక్షులు చేసే విచిత్ర ధ్వనులన్నీ ముద్దకట్టి రొదగా వినిపిస్తున్నాయి.

అందరూ చాపలు పరుచుకుని కూర్చున్నారు. జట్లు జట్లుగా కబుర్లు చెప్పుకుంటూ కొందరూ, సిగరెట్లు కాలుస్తూ కొందరూ, ట్రాన్సిస్టర్లు నెమ్మదిగాట్యూన్ చేసుకుని వింటూ కొందరూ కూర్చున్నారు.

ఆ ఆడ పిల్లలు నలుగురూ—నలుగురూ పెళ్లికానివారే— ఒక ప్రక్కన కూర్చుని తరిగిపోని కబుర్లలో పడ్డారు. ఈ ఆడవాళ్లలో చిత్రమైన విషయమేమిటంటే కనీసం ఏ యిద్దరు ఒక్కచోట కలుసుకున్నాచాలు కల్పాంతం వరకూ కబుర్లకు లోటుండదు. ఏవేవోవిషయాలు త్రవ్వుకునిత్రవ్వుకుని మాట్లాడుకుంటూనే ఉంటారు. అలా ఎడతెగకుండా మాట్లాడుకుంటూనే, ఒకరి వంక ఒకరు – చీరె, జాకెట్టుల మొదలుకుని ఒంటిమీది బంగారం వరకూ సర్వవివరాలూ విప్పారిన కళ్లతో గమనిస్తూనే ఉంటారు.

నేను కొంచెం పక్కగా నడిచి వెళ్లాను. వెళ్లినవాణ్ణి అక్కడే అలాగే నిలబడిపోయాను. అక్కడికి కొంచెందూరంలో ఏదో జంతువు కళేబరాన్ని తీరికగా భక్షిస్తున్నాయి రాబందులు. అటూ యిటూ నేలకుకొంచెంఎత్తులో రెండు రౌండ్లు ఎగరటం, తర్వాత మళ్లీ ఆ శవంమీదికి వ్రాలి, భోజనం బల్లమీద రొట్టె గుచ్చుకునే సాధనంవంటి పదునైన ముక్కుతో కొంచెం మాంసం పీకి మళ్లీ కొద్ది ఎత్తుకు ఎగిరి రౌండ్లుకొట్టడం— అలా చేస్తున్నాయి అవి.

రామమూర్తి నా వెనకవచ్చి నిలబడి "ఏమిటి చూస్తున్నారక్కడ? పదండి" అంటూ నన్ను లాక్కుపోయాడు. అక్కడ ఎవరిపాటికివారు కాలక్షేపం చేస్తున్నారు. నేను వెళ్లి పేక ఆడుతున్న ఒక బృందం దగ్గర కూర్చున్నాను. వాళ్లాడుకుంటున్నంతసేపూ అలాచూస్తూనే కూర్చున్నాను. నేను చిన్నతనం నుంచీ చాలామంది పేకాడుతూ వుండగా చూశాను. ఆ ఆటలో ఒడుపు లేవీ నాకు బొత్తిగా తెలియవు. మా దూరపు చుట్టం ఒకాయన ఉండేవాడు. ఆయనకు యిటువంటి విద్యలు బాగా తెలుసు. పేకాటలో ఆరితేరిన వాడని అందరూ అనుకుంటూ ఉండేవారు. అందుకే అతి త్వరగా ఆరిపోయాడు. సర్వస్వమూ కోల్పోయి చివరకు నీళ్లుమోసుకుని బ్రతికాడు.

అంతలోనే "లేవండి.....లేవండి......భోజనాలు కానిచ్చేదాం" అంటూ ఒకాయన వచ్చాడు. ఆయన భోజనాల 'ఇన్‌ఛార్జి' అన్నమాట. నేను ఉదయం లేచింది మొదలు గుక్కెడు నీళు కూడా గొంతులో పోసుకోలేదు. నేనూ లేచాను. ఆ పేకాటలో కూర్చున్న నలుగురూ "ఇదుగో.....ఒక్క క్షణం.." అంటున్నారేగాని లేవడంలేదు. ఆయనేమో మొండిగా "లేస్తే

గాని కుదురదు. భోజనాలా మరోటా? అందరూ ఆకలితో నకనక లాడిపోతున్నారు......'' అంటున్నాడు. వాళ్లు జీడిపాకంలా సాగుతున్నారు. ఆయన వారిని ఒదలటంలేదు. నా కాయనను చూస్తే మునుపు మా యింటి ప్రక్కన వుంటూ వుండిన ఒకాయన గుర్తు వచ్చాడు. ఆయన ఎప్పుడూ భోజనం, తిండి విషయంతప్ప మరోటి మాట్లాడేవాడుకాదు. ఎవరేమని పలుకరించినా, ఏ విషయం గురించి మాట్లాడినా, చివరకు భోజనం దగ్గరికి సంభాషణను మళ్లించుకు వచ్చేవాడు. —భోజనాలముందు కూర్చున్నాం. రకరకాల పదార్థాలు వడ్డిస్తున్నారు. ఆ భోజనాల 'ఇన్‌ఛార్జి' హుషారుగా 'సర్వ్' చేస్తున్నాడు.

నేను భయపడ్డట్టే గొంతు మంట ప్రారంభం అయింది. అదేమి శాపమో తిండి గురించి అనుకుంటే చాలు గొంతు మండుతున్నది. ముద్ద ముద్దకూ కళ్లు నీళ్లతో నిండి పరమాత్ముడు కనబడుతున్నాడు. అయినా పట్టుదలగా కొన్ని ముద్దలు మింగాను. ఒకప్పుడు నేను స్నేహితులతో పందెం కట్టి పది పచ్చిమిరపకాయలు ఏక బిగిన నమిలి మింగి పందెం గెల్చిన విషయం గుర్తుకు వచ్చింది.

ఆ నలుగురు ఆడపిల్లలూ చాలా నాజూకుగా అన్ని పదార్థాలూ, కొంచెం కొంచెంగా రుచి చూసి ఒదిలేస్తున్నారు. నాకు వాళ్లనుచూస్తే చిత్రమనిపించింది. ''అసలు ఈ ఆడవాళ్లు 'ఆవురావురుమ'ని భోజనం చేయడం అంటూ ఉంటుందా?'' అనిపించింది.

భోజనాలు పూర్తి కాగానే మరో పావు గంట విశ్రాంతి తర్వాత అసలైన కార్యక్రమం (అంటే పాంగ్సు.....మిమిక్రీ.) జరుగుతుందని రామమూర్తి చెప్పాడు.

అందరూ కిళ్లీలు నములుతూ, సిగిరెట్లు కాలుస్తూ భుక్తాయాసంతో చాపలమీద కూలబడ్డారు. నేను కిళ్లీ వేసుకుని సిగిరెట్టు ముట్టించాను. ఎన్నో ఏళ్లయినట్టనిపించింది సిగిరెట్టు కాల్చి. పొగ ఘాటుగా లోపలికివెళ్లి వూపిరి తిత్తులనిండా నిండి నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎన్నడూ లేనంతగా గొంతులో మంట పుట్టింది. దూరంగా వెళ్లి సిగిరెట్టు విసిరి పారేసి దగ్గుతూ కిళ్లీ ఉమ్మివేసి కళ్లు తుడుచుకున్నాను.

మరో పావుగంట గడిచినట్టే అనిపించలేదు. ఈలోపల అక్కడ మైక్ ఏర్పాటు చేశారు. ఒక చెట్టుకు స్పీకర్ బిగించారు. పలుకుతున్నదో లేదో అని ఒక వ్యక్తి టెస్ట్ చేస్తూ వుంటే స్పీకరుకు దగ్గరగా కూర్చునివున్న ఒక బుల్లిపిట్ట అదిరిపడి ఎగిరి దూరంగా వెళ్లిపోయింది. అంతలో రామమూర్తి అందర్నీ ఒకచోటికిచేరి కూర్చోమన్నాడు.

అందరూ ఎలా కూర్చున్నారంటే—నాకు ఆ సముద్రాల అడుగున విహరించే ఎనిమిది చేతుల జంతువునోరు గుర్తుకు వచ్చింది. ''ప్రోగ్రాంలో మొదటి అయిటం'' గుర్తుకు రాగానే ఎందుకో చిత్రమైన అనుభూతి కలిగింది. డాక్టరు పెటిన గడువు దాదాపు పూర్తి కాబోతున్నది.

రామమూర్తి నా పేరు చెప్పి నన్ను గురించి ప్రశంసాపూర్వకంగా నాలుగుముక్కలుమాట్లాడి నన్ను 'మైక్‌ముందరకు రమ్మ'ని కోరాడు. అందరి చూపులూ నామీదికి మళ్లి నామీదనే నిలిచాయి. హఠాత్తుగా ఆ భయంకర సముద్ర జంతువుకోరలమధ్య చిక్కుకుపోయినట్టయింది. నేను తడబడుతూ, ''ముందు మిగతాది కానివ్వండి'' అంటున్నాను.

అంతలో రామమూర్తి ''సరే అయితే.....అందుకు ఏమీ అభ్యంతరం లేదు మాకు'' అంటూ, ''అయితే యిప్పుడు కుమారి లలితగారు గానం చేస్తారు'' అని ఆమెను ఆహ్వానించాడు. అందరి చూపులూ ఆమెమీదనే కేంద్రీకరింపబడ్డాయి.

అయితే ఆమె నావలె కాకుండా ధైర్యంగా పమిట విదిలించివేసుకునివెళ్లి మైక్‌ముందునిలబడి గొంతుసర్దుకుని పాడటం ప్రారంభించింది. నేను అన్నీ మరిచిపోయి వింటూ కూర్చున్నాను. మొత్తంమీద ఆమె కంఠంలో మాధుర్యమే తప్ప సులువూ సౌలభ్యమూ గోచరించలేదు. కంఠంమీద అధికారం సంపాయించదగినంతగా అభ్యాసం ఆమె చెయ్యలేదనిపించింది. చాలా పర్యాయాలు తాగుతున్న పాలలో వెంట్రుకలవలె అపశ్రుతులు పడ్డాయి. ఆమె పదినిముషాలసేపుపాడి ప్రేక్షకులకు నమస్కారం చేసి యివతలికి వచ్చింది. అందరూ కరతాళ ధ్వనులు చేశారు.

రామమూర్తి లేస్తున్నాడు. ''సరే యిక తప్పదు.....'' అనుకుంటూ అతడు ఎనౌన్స్ చేయకముందే వెళ్లి మైక్ ముందు నిలబడ్డాను. నా ఎదురుగా తల ఎత్తి తెల్లత్రాచులా వుంది మైక్...ప్రేక్షకులవంకచూస్తే ఆసముద్రజంతువు కోరలు గుర్తువచ్చాయి. ఆకాశంవంకచూడగా సొరచేప ఆకారంలో వున్నమబ్బు కనిపించగానే ఒళ్లుజలదరించింది. హఠాత్తుగా కళ్లు మూసుకున్నాను. అప్పుడు పరిస్థితి కొంచెం మెరుగనిపించింది. గొంతు సర్దుకున్నాను.

ఆ తర్వాత, ఒకటి తర్వాత ఒకటిగా పాటలు ఎంత సేపు పాడానో నాకే తెలియదు. కళ్లు మటుకు తెరవనేలేదు. నారక్తం పరవళ్లు త్రొక్కింది. నా నరాలు శ్రుతి చేయబడిన ఫిడేలు తీగలవలె బిగుసుకున్నాయి. సర్వశక్తులూ కంఠంలో కేంద్రీకరించి పాడాను. నా ఒళ్లు నాకు తెలియలేదనిపించింది. ప్రేక్షకులు పాట పాటకూ కురిపించిన కరతాళ ధ్వనులూ, వారు ప్రకటించిన ఉత్సాహమూ మాత్రం నాకు స్పష్టంగా తెలిశాయి.

దాదాపు అరగంటకుపైగాపాడానేమో! ప్రాణాలుగొంతులోకి చేరుకున్నట్టనిపించింది. వూపిరాడలేదు. ఉన్నట్టుండి పడిపోతానేమో అనిపించింది. చివరిపాట ముగించి కళ్లు తెరిచి ప్రేక్షకులకు నమస్కరించి యివతలకి రాబోతూ వుండగా శరీరం తూలింది. నోటినిండా ఏమిటో తడి. దూరంగా వెళ్లి నీళ్లు పుక్కిలించి ఉమ్మివేశాను. ఆ తెల్లని నీళ్లు ఎర్రనై బయటికి వచ్చాయి.

మళ్లీవెళ్ళి జనంలోకూర్చున్నాను. అందరికళ్లూ అభినందన పూర్వకంగా నా వంకకే చూస్తున్నాయి. ఆ లలిత అనే

అమ్మాయి వంక నేను చూడలేదు. నాకు తెలుసు. ఈ రాత్రికి గొప్పగండంఉంది. గొంతులో నిప్పులుచెరిగే సుదర్శన చక్రం గిరగిరా తిరుగుతున్నట్టనిపించింది.

తర్వాత అందరమూ అక్కడ మరికొంచెంసేపు కాలక్షేపం చేశాము. ఒకాయన చాలాకాలంనుంచీ ధ్వన్యనుకరణం అభ్యాసం చేస్తున్నాడట. ఒక అరగంటసేపు ఆయన ప్రదర్శన సాగింది. ఆయన సృష్టిలో సమస్త ధ్వనులనూ అనుకరించ గలడనిపించింది. ఒక్కొక్కటి వింటూ ఆశ్చర్యంతో ఉప్పొంగి పోయారందరూ. నేను లేచి మహా సముద్రపు అగాధాలలో షికార్లు చేసే ఆ ఎనిమిది చేతుల భయంకర జంతువు చేసే సవ్వడిని—అసలు అటువంటిదేదైనా ఉంటే—అనుకరించమని అడుగుదామనుకున్నాను. అది ముగియగానే అందరూ బిలబిల మంటూలేచి సామాన్లుసర్దుకోవడం ప్రారంభించారు. ట్రాన్సిస్టర్ల నోళ్లు నొక్కి భుజాలకు తగిలించుకున్నారు కొందరు. పేకలు తీసి కవర్లలోఉంచి జేబుల్లో ఉంచుకున్నారు కొందరు. కొందరు పాత్రసామగ్రినంతటినీ బస్సువరకూ మోసుకుపోయి లోపల సర్ది ఉంచుతున్నారు.

మరో అయిదు నిముషాలలో బస్సు కదిలి వేగం పుంజుకున్న తర్వాత వెనుదిరిగి చూశాను. కొండ చుట్టూ చుట్టుకున్న పెద్ద నల్లత్రాచుపాములావుందిరోడ్డు.ఆచెట్లూ,చెరువూ,అందులోనీళ్ల ఉపరితలాన్నిపూర్తిగా కప్పివేసినతామర ఆకులూ,వాటి మధ్య అక్కడొకటీ అక్కడొకటీ పువ్వులూ, నేల మీద చెట్ల ఆకుల మధ్యగా వచ్చి పడుతున్న వెలుగు రింగులూ, ఆకాశమూ, రాబందులూ.... అన్నీ క్రమంగా దూరమైపోయాయి. బస్సు వేగంగా నగరం వైపు సాగిపోతున్నది. ఇవన్నీ మళ్లీ ఎన్నడూ చూడలేను నేను. అవును. మళ్లీ చూడలేను.

మా వీధి ముందు బస్సు ఆపించి నేను దిగేసరికి లైట్ల వెలుగులో అక్కడ అంతా పట్టపగలు వలె తోచింది. నియోన్ లైట్లూ, లెక్కలేనన్ని మెర్క్యురీబల్బులూ, "చీకటి అనేది ఒకటి ఈ సృష్టిలో వుందా?" అనిపించేటంత ఉజ్జ్వలంగా వెలుగుతున్నాయి.

నేను మిత్రుల వంక చూస్తూ చేయి వూపుతూ బస్సు కదిలిపోయిన తర్వాత మెల్లిగా నడక సాగించాను.

అలా నెమ్మదిగా నడుస్తూ వుంటే ఊపిరితిత్తులలో నుంచి, గొంతులో నుంచి ఏదో పొంగు ఎగదన్నుకుని వస్తున్న ట్టనిపించింది. ఊపిరితిత్తులలోనూ, గొంతులోనూ రెండు మూడు రకాల భయంకర వ్యాధులు ఒక్కుమ్మడిగా విజృంభిస్తు న్నట్టనిపించింది.

మెట్లు ఎక్కబోతూ వుండగా మామూలుగానే బ్యాంకు గుమాస్తాగారి అమ్మాయి తలఎత్తి నావంక చూసింది. ఆమె వొళ్లో అదే లావాటి పుస్తకం. పూర్తిగా పదిహేను మెట్లు ఎక్కానో లేదో అంతలోనే లోపలి పొంగును అరికట్టలేక రుమాలుతో నోరు మూసుకుని పరుగుపరుగున పైకి వెళ్లి రూము పక్కగా వాంతి చేసుకున్నాను. ఆ తరువాత బయట వున్న నీళ్లు నోట్లో పోసుకుని పుక్కిలించి ఉమ్మివేసి తలుపులు తీస్తూవుండగా, ఆ శబ్దం విన్నాడు కాబోలు వరప్రసాద్ తన గదిలో నుంచి యివతలికి వచ్చి "గురువుగారూ! మీరెక్కడికి వెళ్లారు? ఇవాళ అంతా కనిపించనేలేదు...అన్నట్టు ఒక చిత్రం జరిగింది తెలుసా! నేనివాళ పొద్దున పదిగంటల ప్రాంతంలో క్యాంపునించి వచ్చి తాళం తీసే సరికి లోపల అంతా గందరగోళంగా వుంది. ఎవరో అంతకు ముందు వచ్చి అన్నీ అటూ యిటూ కదిలించి గలీజుగా తయారు చేశారు. ట్రాన్సిస్టరూ, రెండు మూడు టెరిలిన్ చొక్కాలూ, ట్వీడ్‌ప్యాంట్లూ గల్లంతు. పోలీసు రిపోర్టు యిచ్చాననుకోండి" అన్నాడు. నేను కొయ్యబారిపోయి నిలబడిపోయాను. ఉదయం మేము మెట్లు దిగుతూ వుండగా రాజేంద్ర మాకు ఎదురు రావడం గుర్తు వచ్చింది. అయితే నేనేమీ మాట్లాడలేదు.

ఆతర్వాత అతను కొంచెంసేపు నా రూములో కూర్చుని పిక్నిక్ విశేషాలు విన్నాడు.

తర్వాత "అన్నట్టు మీరిప్పుడే కదా తిరిగి వొస్తున్నారు! ఈ పూటకు మా హోటల్లో భోజనం చేద్దాం రండి. ఇద్దరం కలిసి భోజనం చేసి చాలారోజు లయినట్టుంది, ఈ వెధవ క్యాంపుల మూలంగా" అన్నాడు. కాని నేను భోజనం చేయదలుచుకో లేదు. ఆకలి కూడా బొత్తిగాలేదు. అతని మాట తీసివెయ్యలేక "నేను భోంచెయ్యను. మీతోపాటుగా కూర్చుని కాసిని పాలు తాగుతాను పదండి" అన్నాను. అతడు వెళ్లి చొక్కా వేసుకుని వచ్చాడు.

ఇద్దరం క్రిందికి దిగివచ్చి హోటలు వైపు నడిచాము. దోవలో నాకెందుకో దిగులు తెర కప్పుకున్నట్టయింది. వరప్రసాద్ చెయ్యిపట్టుకుని కళ్లలో నీటిపొర గుండా అతని వంక చూశాను. అతడు నివ్వెరపోయి "ఏమిటండీ? ఎందుకలా వున్నారివాళ?" అని అడిగాడు. ఇంకా నయం. అక్కడ వెలుతురు ఆట్టేలేదు. లేకపోతే నాకంటి నీరు అతనికి కనిపించే వుండేది. నేను అంతలోనే సర్దుకుని "లేదులేదు. ఏమీలేదు" అన్నాను నడుస్తూ.

అతడు భోజనం చేస్తూ వుండగా నేను పాలు తెప్పించుకుని చల్లగా చల్లార్చుకుని నెమ్మదిగా గుటకలు వేస్తూ కూర్చున్నాను. ఆ కాసిని పాలూ త్రాగి లోపలికి వెళ్లి చెయ్యి కడుక్కుంటూ అద్దంలో నా ప్రతిబింబం వంక చూసుకున్నాను. అదేమి చిత్రమో, కొంచెం పెద్ద సైజు అద్దం ముందు నిలబడినప్పుడల్లా 'అది నా ప్రతిబింబమేనా?' అని అనుమానం కలుగుతూ వుంటుంది ఎప్పుడూ.

వరప్రసాద్ భోజనం ముగించి రాగానే యిద్దరం బయటికి వచ్చాము. అక్కడ కిళ్లీ కొట్టు ముందు మనోహరం ఏవేవో పత్రికలు కొంటూ నిలబడి వున్నాడు. నేనతన్ని గమనించి కూడా అతని వంక చూడకుండా తప్పుకుపోబోయాను. కాని అతడు చప్పట్లు కొట్టి పెద్దగా పిలుస్తూ వెంటవచ్చి నా భుజం పట్టుకుని నిలిపాడు.

నేను ప్రయత్నం మీద నవ్వి "ఏమిటి విశేషాలు?" అని అడిగాను. అతడు 'ఏమీలేవు' అని సమాధానం చెప్పి నేనూహించని విధంగా అన్నాడు. "మా కొత్తయింటికి రాగూడదుటోయ్ ఒకసారి...చూద్దువుగాని. మళ్లీ నిన్ను తీసుకువచ్చి మీ రూము దగ్గర దిగబెడతాలే"

నేను నవ్వి "మా రూముకు వస్తావా మరి?"అని అడిగాను.

"ఓ, యస్. ముందు మా యింటికి పోదాం. అక్కడ కాస్సేపు కూర్చో. తర్వాత నాగుర్రం మీద యిద్దరం మీరూముకు వద్దాం. కాస్సేపు అక్కడ కూర్చుని నేను మళ్లీ యింటికి వెళ్లిపోతాను" అన్నాడు మనోహరం.

"సరే...చివరకు అన్నీ ముడిపడుతున్నాయి" అనుకుంటూ నేను వరప్రసాద్ వంక తిరిగాను. అతడు మా సంభాషణ అర్థం చేసుకున్నాడు. "అలాగే. మీరు వెళ్లిరండి. నేను రూముకు చేరుకుంటాను" అంటూ నడిచిపోయాడు. మనోహరం, మోటార్‌సైకిల్ వైపు నడుస్తూ "ఏమిటోనోయ్? ఈ బిజినెస్ వుంది చూశావూ చాలా రిస్క్. వెధవది చచ్చిపోతున్నాననుకో. పైనుంచి చూసేవాళ్లకు బాగానే వుంటుంది. క్షణం తీరిక వుండదు. అన్ని రకాల పత్రికలు కొనుక్కుపోతానా? పేజీలు తిప్పేందుకు కూడా వీలుండదు. సరే మా ఆవిడ కోసమైనా యిది తీసుకుపోక తప్పదనుకో" అంటూ మోటార్ సైకిల్ స్టార్టు చేశాడు. నన్ను 'వెనక కూర్చోమ'న్నాడు. అతడు దోవ పొడుగునా ఏదో మాట్లాడుతూనే వున్నాడు. అంతా అతని బిజినెస్ గురించీ, తీరిక లేకపోవడం గురించీ. చాలా దూరం వెళ్లిన తర్వాత ఒక పెద్ద మేడ ముందు ఆగి, "మేడ ఇటీవలే కొత్తగా కొన్నాం. డెబ్భైయివేలు పోశాం దీని మొహాన. ఏమిటో, అంతా డబ్బు దండగ తప్ప వసతు లసలు లేవు. అయినా ఈ మేడలు కట్టించేవాళ్లు యింత తెలివితక్కువగా ఎందుకు కట్టిస్తారో తెలీదు. చూడు ఒక అందమా, చందమా! ఈ యిల్లు ఎంత డీసెంట్‌గా కట్టించి వుండవచ్చు. వెధవ పాత పద్ధతులూ వీళ్లూనూ" అంటూ నన్ను హాల్లోకి తీసుకువెళ్లి కూర్చోబెట్టి "ఇప్పుడే క్షణంలో వచ్చేస్తాను" అంటూ లోపలికి వెళ్లాడు. అతడలా వెళ్లగానే ఒక యాభై యేళ్ల వ్యక్తి లోపలి నుంచి హాల్లోకి వచ్చాడు. ఆయనను చూస్తూనే గతుక్కుమన్నాను. ఈయన మనోహరం మామగారు కాదుకదా!

ఆయన నా దగ్గరగా వచ్చి నన్ను పరీక్షగా చూసి "నువ్వా భానూ! మావాడు తన స్నేహితుడంటే ఎవరో అనుకున్నాను. ఇప్పుడేం చేస్తున్నావు నువ్వు? ఎక్కడా ఇటీవల కనిపించనేలేదేం?" అని పలుకరించాడు సోఫాలో కూర్చుంటూ.

'నేను కూర్చున్నది పండు నిప్పులతో నిండిన కుర్చీకాదు గదా!' అనిపించి యిబ్బందిగా కదిలి తల వూపుతూ కూర్చుండిపోయానేగాని ఆయన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

ఆ భుజంగరావు అనే వ్యక్తిని అక్కడ చూస్తానని కలలో కూడా అనుకోలేదు. ఆయనది అన్వర్థనామధేయం. సన్నగా రివటలా వుంటాడు. జుట్టులో చాలాభాగం లోకాన్ని వంచించడంలోనే నెరిసిపోయింది. విదేశీ గడియారాలూ, యితర ఖరీదైన వస్తువులూ చాటుగా అధికారుల కన్నుగప్పి పెద్దఎత్తున తెప్పించి లాభాలు సంపాయించేవాడు. దొంగనోట్లు ముద్రించి చెలామణీ చేసేవారితో కూడా ఆయనకు లావాదేవీ లుండేవి. అయితే యిది కొన్ని సంవత్సరాల క్రిందటి సంగతి. ఇప్పుడు కూడా బాహాటంగా ఆ పనులు చేస్తున్నాడో లేదో తెలియదు. పైగా మహాదారుణమైన విషయ మేమిటంటే మనోహరం, బృంద భర్త కావడం.

అయ్యో, పాపం మనోహరం! నేనిన్నాళ్లూ నిన్ను చూసి నువ్వేదో సుఖపడి పోతున్నావని కొంచెం అసూయ చెందాను. కాని యిప్పుడు నీపట్ల జాలితో నా హృదయం నిండిపోతున్నదోయ్!

బృంద రూపం కళ్లలో మెదిలింది. చాలా అందమైన గోధుమ వన్నె త్రాచుపాము అది. ఆ భయంకర సముద్ర జంతువు తాలూకు ఎనిమిది చేతులలోనూ ఒకటి. ఆ క్రూరమైన షార్క్ ఆకలి తీరక ధరించిన మరో రూపం. మనుష్యులను కాల్చి తిని వేసే కాన్సర్ ఎత్తిన అవతారం. మనోహరం మొహం టవలుతో తుడుచుకుంటూ హాల్లోకి వచ్చాడు. నిండుగా, సంపదవల్ల సంక్రమించిన గర్వంతో, నవ్వుతున్న అతని వంక జాలి నిండిన కళ్లతో చూశాను. అతడు, అమాయకంగా సాలెగూటిలో చిక్కుకున్న చిన్నపురుగులా, అగ్ని వైపుకు వెళ్లే శలభంలా, సముద్రం అడుగున ఆ జంతువు ఎనిమిది చేతులలో చిక్కుకున్న అమాయక ప్రాణిలా, షార్క్ క్రౌర్యానికి బలి అవుతున్న చిన్న బంగారు రంగు చేపపిల్లలా, కనిపించాడు. అయినా అతని కేమీ తెలిసినట్టులేదు. అబ్బో! భుజంగరావు సామాన్యుడా? నిన్ను గురించి నీకే తెలియకుండా చేయగల దిట్ట. ఈ లెక్కన ఆలోచిస్తే తాను చిక్కుకున్న సుడిగుండం ఎంత భయంకరమైనదో మనోహరం ఎప్పటికీ తెలుసుకోలేడు. జీవితమంతా అతడు ఆ తీపిపూసిన చేదు మాత్రలే మ్రింగి మోసపోతూ వుంటాడు. తప్పదు.

గొంతులో మంటపుట్టి యిబ్బందిగా లేచి నిలబడ్డాను. మనోహరం నవ్వుతూ చొక్కాగుండీలు పెట్టుకుంటూ మామగారివంకతిరిగి "ఇతన్ని యింటిదగ్గర దిగబెట్టివస్తాను" అన్నాడు.

ఆయన తల వూపుతూ "అలాగే. నిక్షేపంగా వెళ్లిరా" అన్నాడు.

ఆ యింటి నుంచి బయటికి వొస్తూ వుండగా బృందను ఒక్కసారి చూస్తే బాగుండు ననిపించింది. ఆ కోరిక ఎందుకు కలిగిందో తెలీదు. నా లోపలి క్షుద్రుడికి అన్నీ యిటువంటి కోరికలే......

మోటార్‌సైకిల్ వెనక సీటులో కూర్చుని 'రివ్వు'న సాగిపోతూ వుండగా అంతా గుర్తుకు వచ్చింది.

కొన్ని యేళ్ల క్రిందట—అప్పటికి యింటర్మీడియేట్ తప్పి కూర్చుని వున్నాను—వారి యింటిలోనే ఒక గది అద్దెకు తీసుకుని కొందరు చిన్నపిల్లలకు చదువు చెబుతూ కాలం వెళ్లబుచ్చుతూ వుండేవాణ్ణి. అప్పటికి యింకా జీవితం నాపాలిట

శాపం కాలేదు. తింటూ తిరుగుతూ చిన్నపిల్లలకు పాఠాలు చెబుతూ వుంటే హాయిగానే రోజులు వెళ్లిపోతూ వుండేవి. అప్పుడప్పుడు నా గదికి బృంద వస్తూ వుండేది. వచ్చి వూరికే కాస్సేపు కూర్చుని ఏదో మాట్లాడి వెళ్లిపోతూ వుండేది. నేనామెను ప్రేమించానని చెప్పడం అసంగతమే కాని అతిశయోక్తి కాదు. ఆమె అంటే 'యిష్టం' వంటి భావమేదో నాలో కలిగింది. దానికి తోడు ఆమె నాతో చాలా సన్నిహితంగా చనువుగా వుండేది. ఒక్కొక్కప్పుడు ఆమెను చూస్తూ వుంటే ఎవరో అదృశ్య వ్యక్తి బాణం పెట్టి మనసుకు గురిపెట్టి కొట్టినట్టనిపించేది. ఒక పర్యాయం ఆమెను వరండాలో చూశాను. ఆమె పరికిణీ పచ్చని పిక్కలు కనిపించేలా మోకాళ్ల వరకూ పైకి కట్టుకుని, పమిట బిగించి వేసుకుని మెలిదిప్పి బొడ్లోదోపుకుని రంగుల త్రాటితో 'స్కిప్పింగ్' చేస్తున్నది. ఆమె నుదుట ముత్యాల వరుస వలె స్వేదం..... అలుపుతో ఎగిరెగిరి పడుతున్న ఉన్నత వక్షం. అందమైన ఆకాశ ఖండాల వంటి ఆ నీలికళ్లు, నాలో ఏదో తెలియని సంచలనం కలిగించాయి. హఠాత్తుగా దగ్గరికి వెళ్లి నిలబడ్డాను. ఆమె స్కిప్పింగ్ ఆపకుండా నావంక చూసి నవ్వుతున్నది. తర్వాత 'యా భై' అంటూ ఆయాసంతో ఒగర్చుతూ ఆగి నావంక 'ఏమిట'న్నట్టు చూసింది. నేను "ఏమీలేదు" అంటూ యివతలికి వచ్చేశాను. నా లోపలి కష్టుద్రుడు అప్పటికి నన్ను యింతగా లోబరుచుకోలేదు మరి.....

ఒకనాడు—ఆరోజు భుజంగరావు వూళ్లోలేడు— నేను అద్దె యిద్దామని వెళ్లాను. హాల్లో నిలబడి చూశాను. లోపల నుంచి నవ్వులు వినిపించాయి. గుమ్మంపైగా వున్న పెద్ద బల్లి బొమ్మ వంక చూస్తూ కాస్సేపు నిలబడి తర్వాత లోపలికి వెళ్లి కిటికీలో నుంచి చూశాను. లోపల బృంద ఎవరో నడివయసు మగవాడికి దగ్గరగా కూర్చుని విరగబడి నవ్వుతున్నది. నేను విసవిస వచ్చేశాను. అప్పుడే ఆమె అంటే ఒకరకమైన ఏహ్యభావం కలిగింది. తర్వాత కొన్ని నెలలకు వారి యింటికి ఒక లేడీ డాక్టరు రావడం చూశాను. భుజంగరావుకు నేనెరిగినంతవరకూ ఏరోగమూ లేదు. బృంద సరేసరి స్కిప్పింగ్ అయితే చేయడం లేదుగాని మెరుపులా హుషారుగా నవ్వుతూ తిరుగుతూనే వుంది. ఇక ఆ యింట్లో పనివారు తప్ప మరెవరూ లేరు. ఆతర్వాత కొన్ని రోజులకు ఆయింటి పనిమనిషి ఒకడు నాకు సన్నిహితుడైనాడు. వాడు పెద్ద రేడియో సమాచార కేంద్రం వంటివాడు. నా రూముకు వచ్చి వాడు తీరికగా చుట్ట కాల్చుకుంటూ వుండేవాడు. వేరే ఎక్కడ చుట్ట కాల్చుకున్నా యజమాని చూస్తే వూరుకోడట. వాడు నాకు ఒకదాని వెంట ఒకటిగా సమస్త వివరాలూ చెప్పి తీరా వెళ్లేటప్పుడు "ఇది బయటికి అన్నారంటే నా నోట్లో దుమ్మే. మీకు పుణ్యం వుంటుంది. ఎక్కడా అనకండి" అని వొట్టు వేయించుకున్నాడు. వాడు చెప్పినవన్నీ విని సమన్వయం చేసుకుంటే భుజంగరావు అసలు స్వరూపం నాకు బోధపడింది. ఆయన యింటికి ఎవరెవరు ఎందుకు వొస్తూ వుంటారో, ఎవరెవరితో ఆయనకు ఎటువంటి లావాదేవీ లున్నాయో సర్వం తెలిసింది. వాడే లేడీడాక్టరు ఎందుకు వచ్చిందో కూడా చెప్పాడు. బృందకు నాలుగోనెలట...నేను కొయ్యబారిపోయి "మరి...పెళ్లి.?" అన్నాను. వాడు నవ్వి "కాకుండానే సామీ. మీదంతా అదో పిచ్చి మాలోకం. ఎవరో పెద్ద ఆఫీసరు పుణ్యం అది. ఇప్పుడు మాత్రం పోయిందేముంది? తీసేశారుగా" అన్నాడు. భ్రూణహత్య! నా కళ్లు తిరిగిపోయాయి. అందమైన మొగలి పొదలో ఎటువంటి భయంకరమైన పాములుంటాయో తెలిసి వచ్చింది.

మనోహరం "ఎక్కడయ్యా నీ రూము?" అని అడుగుతున్నాడు. దాదాపు మా సింహద్వారం ముందే మోటారుసైకిలు ఆపి వున్నాడు.

నేను దిగి "ఇదే...లోపలికి..." అన్నాను నడుస్తూ.

అతడు మోటార్‌సైకిలు తాళం వేసి ఆతాళం చెవుల గుత్తిని చేతితో తిప్పుకుంటూ నావెనకనే వచ్చాడు. అందరూ నిద్రలు పోతున్నట్టున్నారు. ఏ భాగంలోనూ అలికిడిలేదు. బ్యాంకు గుమాస్తా మాత్రం మేలుకుని వున్నట్టున్నాడు. శబ్దం విని "ఎవరది? రాజా..." అన్నాడు.

"కాదండీ.. నేను..." అన్నాను నేను.

ఆయన నన్ను గుర్తించి "మీరా? వాడింకా రాలేదండీ... వాడి కోసమే చూస్తున్నాను" అన్నాడు.

'మీ వాడిప్పట్లో రాడులే. వరప్రసాద్ రూములో పోయిన వస్తువులెంత తక్కువకు అమ్ముకున్నా బోలెడు డబ్బు వస్తుంది. అదంతా వినియోగం కావద్దూ. అంతవరకూ వాడు యింటికి రాడు' అనుకుంటూ మెట్లు ఎక్కాను. మనోహరం నావెనకనే వచ్చాడు. పదిమెట్లు ఎక్కేసరికి మళ్లీ దగ్గు ముంచుకు వచ్చింది. దగ్గు ఆపుకునే ప్రయత్నంలో రుమాలు నోటికి అడ్డం పెట్టుకున్నాను. పైకి వెళ్లి చూస్తే రుమాలు చాలాభాగం తడిసింది. నీళ్లు పుక్కిలించి ఉమ్మివేశాను. తలుపులు తీసి మనోహరాన్ని లోపలికి రమ్మన్నాను.

"ఎందుకోయ్, వెడతాన్లే.." అంటూనే అతడు లోపలికి వచ్చి కూర్చుని చుట్టూ చూశాడు. తర్వాత కాస్సేపాగి "అద్దె ఎంత యీ గదికి?" అని అడిగాడు.

చెప్పాను. విని చప్పరించాడు. తర్వాత ఏమీ తోచనివాడిలా రుమాలుతో విసురుకున్నాడు. నేను కూడా యిక ఏమీ మాట్లాడలేదు. అలాగే పైకి చూస్తూ కూర్చుండిపోయాను. కాస్సేపాగి అతడు "సరే.. యిక వెడతాను.." అంటూ లేచాడు. నేను అప్పుడు ఏదో అడుగుదా మనుకున్నాను. కాని అడగలేదు. అతని వెనకనే లేచి వెళ్లి సాగనంపాను. అతడు మెట్లు పూర్తిగా దిగి వెళ్లాడో లేదో అంతవరకూ లోపల ఆగివున్నదేదో విరుచుకుని పైకి పొంగింది. గబగబ వెళ్లి తూము దగ్గర ఉమ్మివేశాను. వెంటనే అటువైపు చూడకుండా నీళ్లు నోట్లో పోసుకుని పుక్కిలించి వుమ్మివేసి వెళ్లి పక్కమీద వాలిపోయాను. అంతలో చలి వేసింది. కప్పుకుని ముడుచుకుని పడుకున్నాను. క్రమంగా నిద్ర పట్టిందనుకున్నాను. కాని స్పృహతప్పిందనే విషయం మరునాడు వరప్రసాద్ చెప్పేవరకూ తెలియలేదు నాకు...

## 6

కళ్లు తెరిచి చూసేసరికి నాచుట్టూ కనిపించింది గోడ అనుకున్నాను. కాదు. అది మంచం చుట్టూ ఉన్న తెర. నేనెక్కడ ఉన్నానో నాకు తెలియలేదు. వొళ్లంతా ఎటయినా ఎగిరిపోగలిగినంత తేలికగా అయితే వుందికాని తలనొప్పి బాధిస్తున్నది. ఎదురుగా తెర లోపలి వైపున సన్నని ఎర్రదీపం వెలుగుతున్నది. అది ఎందుకు వుంది అక్కడ? అసలు నేనెక్కడ ఉన్నాను?

తెర తొలిగింది. రెండు ముఖాలు కనిపించాయి. ఒకడు వరప్రసాద్. రెండవ ఆమె తెల్లని దుస్తులు ధరించి నర్సులా వుంది. ఆమె అంటున్నది "కదులుతున్నాడు. డాక్టరును పిలుచుకు వస్తాను."

వరప్రసాద్ నాప్రక్కనే కూర్చున్నాడు. అతని కళ్లలో నీళ్లున్నాయో? ఏమోమరి! నాకళ్ల ముందు అంతటా పలుచని తెరలు దింపినట్టున్నది. వరప్రసాద్ నా మీదికి వంగి 'ఇప్పుడెలా వుంది గురువుగారూ?' అని అడిగాడు.

నేను తల వూపానేగాని మాట్లాడలేదు. కదలబోయాను. గొంతుక దగ్గర నుంచి పొట్టవరకూ ఏవో కట్లు... వరప్రసాద్ అంటున్నాడు, "మీకు స్పృహలేదు. నేనే ఆస్పత్రికి తీసుకువచ్చి చేర్చాను."

నేనతని చెయ్యి అందుకుని "పోనీ యిది చెప్పండి. నేను బ్రతుకుతానన్నారా డాక్టర్లు?" అని అడిగాను.

అతడు భయంగా చూస్తూ తలవంచుకున్నాడు. పాపం! అనుభవంలేని కుర్రవాడు. అతన్ని అడగటంవల్ల లాభంలేదు. డాక్టరు నోటి మీదుగానే అంతా వినాలి.

మహా సముద్రం లోతులలోవుండే ఆ భయంకర జంతువు అప్పుడే తన ఎనిమిది చేతులను ఘోరంగా కదిలిస్తూ విలయ నృత్యం చేస్తున్నది నా కళ్లముందు.

నన్ను మొదట్లో పరీక్ష చేసిన డాక్టరూ, ముక్కు మీదికి నిరంతరం జారుతూవుండే అతని కళ్లజోడూ, ఎల్లప్పుడూ చెమటలుపట్టే అతని నుదురూ గుర్తొచ్చాయి. "మహా అయితే మూడు నాలుగు నెలలు. కావలసిన వారెవరైనా ఉంటే పిలిపించండి." ఆయన మాటలు కూడా మళ్లీ వినిపించినట్టయింది. "ఎవరున్నా రతనికి ఈ లోకంలో" అన్నాడు నా మిత్రుడానాడు. కాదు. అది తప్పు. వరప్రసాద్ లేడూ మరి....

డాక్టరు అనుకుంటాను, నామీదికి వంగి నా కళ్లలోకి చూశాడు. కాస్సేపు చూసి తల పంకించాడు. అంతలోనే నేను స్పృహతప్పినట్టు నటిస్తూ కళ్లు మూసుకున్నాను. డాక్టరు నోటివెంట వివరాలు తెలుసుకోవాలంటే మరి యిదేమార్గం. నా ఎత్తుగడ మంచి ఫలితాన్నే యిచ్చింది. ఆయన తెర దింపి వరప్రసాద్‌తో అంటున్నాడు.

"ప్చ్......అట్టే లాభం లేదండీ. ఇలాగే స్పృహ వస్తూ పోతూ వుంటుంది. స్పృహ ఉన్నంతసేపూ తెలివిగానే మామూలుగానే ఉంటాడు. మహా అయితే యిప్పటినుంచీ ఒకరోజు. ట్వొంటీఫోర్ అవర్స్. అంతే.....ఆ తర్వాత..." మాటలు పూర్తి చెయ్యకుండానే డాక్టరు బూట్లు టక టక లాడించుకుంటూ వెళ్లిపోయాడు.

నేను బాధకు ఓర్చుకుంటూనే తల కొద్దిగా విదిలించాను. వరప్రసాద్ తెర తొలిగించి చూశాడు. నా ప్రక్కన కూర్చోమని సైగ చేశాను. కూర్చున్నాడు. అతని చెయ్యి అందుకున్నాను. హఠాత్తుగా అన్నదాన సమాజానికి ఆనాడు అతడు నా వెంట రావడం గుర్తు వచ్చింది. "ఇక నాకు ఎలాగూ వీలు పడదు. మీరు దయతో కనీసం యిక్కడ ఉద్యోగం చేసి నన్నాళ్లూ అయినా ప్రతి నెలా ఎంతో కొంత ఆ అన్నదాన సమాజంలో సత్యమూర్తి గారికి యివ్వండి. ఈసారి ఆయనను కలుసుకున్నప్పుడు నేను అడిగానని చెప్పండి" అన్నాను.

వరప్రసాద్ కళ్లలో నీళ్లు నిలిచినట్టు అనుమానం కలిగింది. నేను వెళ్లేచోట భగవంతుడంటూ ఎవరైనావుంటే చాలా మందిని దయతో చూడమని చెప్పాలి.

నేను మళ్లీ ఏమీ మాట్లాడకుండా పడుకుని ఉండిపోయాను. అతడు కూడా అలాగే కూర్చున్నాడు. నా మనసు పాదరసంవలె జరజర ప్రాకి పోతున్నది. నేను మరొక యిరవై నాలుగుగంటలలో అసలులో ఉండను. అంటే ఏమైపోతాను? ఎక్కడికన్నా ఎగిరి పోతున్నట్టుంటుందేమో! అయినా తినబోతూ రుచిని గురించిన ఆరాటం ఎందుకు?

బుల్లి చేతి వాచీ మాటి మాటికీ చూసుకుంటూ, రుమాలుతో మొహం అద్దుకుంటూ రత్నావళి మామూలుగానే హంసలా నడుస్తూ రోజూ బస్సుస్టాపుకు వస్తూవుంటుంది. ఆమె చుట్టూ మామూలుగానే అయిదారు అడుగుల కైవారంలో చక్కని పరిమళం రోజూ వ్యాపిస్తూనే ఉంటుంది కాబోలు. ఎదురుగా హొటల్లో కౌంటరుముందు కూర్చుని ఉండే బట్టతల వ్యక్తి, ప్రక్కనే స్టేషనరీ స్టోర్సులో తీరికగా కూర్చుని ఆవులిస్తూవుండే మెల్లకన్ను వ్యక్తి గుర్తుకువచ్చారు. స్టేషనరీ స్టోర్సులో మూల పని లేక పడివుండే ఫోను గుర్తుకు వచ్చి నవ్వుకున్నాను.

వరప్రసాద్ "ఏమిటండీ, నవ్వుతున్నా రెందకు?" అని అడిగాడు. "నేను "ఏమీ లేదం"టూ కళ్లు మూసుకున్నాను.

అంతలో ప్రక్కనే ఏదో హడావిడి.....ఎవరినో మంచం మీదినుంచి తీసుకుపోతున్నారు. ఎవరిదో కంఠస్వరం "త్వరగా తీసుకు పదండి" అంటున్నది. ఆ కంఠస్వరం క్రూరంగానూ, నిర్దాక్షిణ్యంగానూలేదు. అలా అని మృదువుగానూ లేదు.

వరప్రసాద్ వెళ్లిచూశాడు. నా పక్క మంచంమీదవున్న మనిషి నాకు తెరగుండా కనిపించాడు. అతడు మంచం మధ్యలో కూర్చుని అవతలి వ్యక్తిని తీసుకుపోవడం కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్నాడు. అతన్ని చూస్తూవుంటే మా యింటి పక్కన, తలనొప్పి వచ్చినా అరిచీ, కేకలు పెట్టీ గందరగోళంచేసే పెద్ద మనిషి గుర్తుకు వచ్చాడు. ఈ యిద్దరికీ ఎంత భేదం?

అవతలి మంచంమీద కూర్చునివున్న వ్యక్తి వరప్రసాద్‌తో అంటున్నాడు. "అతనిపేరు కృష్ణమూర్తి. నాలు గైదు రోజుల క్రిందట ఏదో వర్క్‌షాపులో ప్రమాదంలో రెండు కాళ్లూ తెగిపోయాయి. ఇక్కడికి తీసుకువచ్చి చేర్చారు. మొదట్లో అవిటివాడుగానైనా బ్రతుకుతాడని అనుకున్నారంతా. కాని యివాళ సాయంకాలంనుంచీ వాతం కమ్ముకుని వచ్చింది. పైగా యిక్క డెవరూ కావలసినవారు లేరు కూడా....."

నాకు వెంటనే నా గదిలో పోస్ట్‌మేన్ పడేసిన ఉత్తరం మనసులో మెదిలింది. కృష్ణమూర్తి! అవును. ఆ ఉత్తరం పేరు అదే. కాని యితడు, అతడు ఒకరు కాగూడదు. ఆ శోక దేవత అయిన పడచు అన్న నగరంలో ఎక్కడో పని చేస్తూ సుఖంగా ఉండే ఉంటాడు అనుకున్నాను. కాని నా లోపలి క్షుద్రుడు ఒప్పుకోవడం లేదు. "ఆ యిద్దరూ ఒక్కటే నోయ్! నువ్వు కాదనిమాత్రం ఏం లాభం? ఆ కృష్ణమూర్తి ఈ కృష్ణమూర్తి ఒకడే.......ఇప్పుడు లోకం వదలి వెళ్లిన నిర్భాగ్యుడిదే ఆ ఉత్తరం" అని గొంతు చించుకుంటున్నాడు వాడు.

నాకు రేకుల గదిలో కొడుకుతో సహా అద్దెకుంటున్న యాభై యేళ్ల స్త్రీ గుర్తుకు వచ్చింది. ఆ ప్రామిసరీనోటు వ్రాసి యిచ్చినవాడు ఎప్పటికయినా, అందులో కొంత అయినా ఆమెకు ముట్టజెపుతాడో లేదో!

వరప్రసాద్ మళ్లీ నా మంచం ప్రక్కనే స్టూలుమీద కూర్చున్నట్టున్నాడు. అతని నీడ తెరమీద పడుతున్నది. పాపం! ఇతనికీ నాకూ ఏమిటి అనుబంధం? ఆరోజు అతనితో అతని స్నేహితులతో చెప్పకుండా వచ్చేయడం గుర్తుకు వచ్చింది. చెయ్యి తెరలోనుంచి బయటికి పోనిచ్చి అతన్ని తట్టి పిలిచాను. అతడు లోపలికి తలపెట్టిచూసి "ఏమిటి?"అని అడిగాడు. నేను నెమ్మదిగా "ఆరోజున గ్రౌండ్‌లో ఆట చూసేందుకువెళ్లాము గుర్తుందా? నేను మధ్యలోనే వచ్చేశాను. మీరందరూ ఏమను కున్నారో.....అందుకు ఏమీ అనుకోకండి. మీ ఫ్రెండ్సుకు కూడా చెప్పండి" అన్నాను.

వరప్రసాద్ మతిపోయినట్టు చూసి అంతలోనే తేరుకుని తల వూపి, "మేమేమీ అనుకోలేదు. మీరనవసరంగా అటువంటి చిన్న విషయాలు గుర్తుకు తెచ్చుకుని బాధపడకండి. హాయిగా నిద్రపొండి కాస్సేపు" అన్నాడు.

"అవును. నిద్రపోవాలి. అయినా నిద్ర రావద్దూ. దాని వేళకుగాని అది రాదు. నాకు అంతలో మా ఆఫీసూ, నాలుగుచక్రాల బండిలో తినుబండారాలమ్ముకునే సాయిబూ, హెడ్ గుమాస్తా, కిటికీలోనుంచి చూస్తే కనబడే పెద్ద మర్రిచెట్టూ, క్యాంటీనూ, చిన్న చిన్న లోహపు బిళ్లల టోకెన్లూ, అన్నీ గుర్తుకు వచ్చాయి. మా హెడ్ నా సీటులోకి వచ్చే మరొకణ్ణి కూడా అలాగే చూస్తాడు కాబోలు! అసలు ఎవడొస్తాడో ఆ సీటులోకి? పూర్ ఫెలో.....

అగ్ని ప్రమాదం జ్ఞాపకం వచ్చింది. ఫౌండ్రీలో పని చేసే ఆ తాగుబోతు, త్రాగుడూ, జూదమూ యిక ఎప్పటికీ మానడనుకుంటాను. ఆ వృద్ధురాలూ, ఆమె కోడలూ, పిల్లలూ, మళ్లీ గుడిసె వేసుకున్నారో లేదో.

అన్నట్టు వరప్రసాద్ పోయిన వస్తువులకోసం పోలీసు రిపోర్టు యిచ్చానన్నాడు. అబ్బే, లాభం లేదు. రాజేంద్ర వచ్చే వరకూ ఆ విషయం తేలదు. అతడు వచ్చాడో లేదో! బ్యాంకు గుమాస్తా కూతురు ఆ లావుపాటి పుస్తకాన్ని యింకా చదువుతూనే ఉండి ఉంటుంది. ఆ పుస్తకాల బరువే ఆమెను క్రుంగ దీస్తున్నది పాపం! ఆ అర్భకురాలు తల్లి దండ్రులు తనమీద పెట్టుకున్న ఆశలు నెరవేరుస్తుందా?

ఆ హిందూస్తానీ వ్యక్తి ఇక హాయిగా నిద్రపోతాడను కుంటాను. నా పాటల పీడ విరగడై పోయిందని హాయిగా నిట్టూర్చాడు కాబోలు!

పిక్నిక్ దృశ్యాలన్నీ మనసులో పంచరంగుల సినిమా రీలువలె కనిపించాయి.

ఆ నీలి ఆకాశమూ, ఎప్పుడు దొర్లుతాయో అన్నట్టుండే ఆ ఎర్రని రాళ్లూ, కొండను చుట్టుకునివున్న నల్ల త్రాచు వంటి రోడ్డూ, తామర ఆకులతో ఉపరితలం బొత్తిగా కనిపించని కొలనూ, ఆ ఆకుల మధ్యలో నాలుగైదు పువ్వులూ, (అవి నేను చూసినప్పుడు వికసించి ఉన్నాయా? లేక మొగ్గలేనా?) చెట్ల ఆకుల సందునుంచి నేలమీద పడుతున్న వెలుగు మచ్చలూ, తీరికగా ఎగురుతూ వుండిన రంగు రంగుల పక్షులూ... అవన్నీ మళ్లీ నాకు కనిపించవు కాబోలు!

అంతలోనే మోటారు సైకిలు శబ్దం వినిపించినట్లయి వెనువెంటనే మనోహరం గుర్తు వాచ్చాడు. పాపం! ఇక జీవిత మంతా తన భార్యను గురించీ, మామగారిని గురించీ బోలెడు విషయాలు తెలియకుండానే అలాగే మోసపోతూ గడుపుతాడు కాబోలు. అతన్నిచూసినమొదట్లో అసూయవంటిభావం మనసులో కలిగినందుకు ఎంత సిగ్గుపడినా తీరదు. నిజానికి అతన్నిచూసి జాలిపడాలి. ఆ అమాయకుడు అలాగే షార్క్‌చేత తినబడుతూ కూడా తెలియని పిచ్చి చేపలా, సాలెగూటిలో చిక్కుకుని కూడా ఆ విషయం తెలియని అమాయకపు పురుగులా, అలాగే కాలం గడుపుతాడు. బృంద అందం అతని కళ్లు ఎన్నడూ తెరుపుడు పడకుండా ఉంచేందుకు చాలిన శక్తికలిగిన మత్తు మందు....

నా పెట్టెలో అడుగున ఉన్న మా తాతయ్య ఫోటో గుర్తుకు వచ్చింది. 'దేవుడి దగ్గరికి వెళ్లిన వాడికి ఫోటో ఎందుకు?' అనిపించింది. వెంటనే 'దేవుడున్నాడా? లేడా?' అని పోట్లాడుకున్న యిద్దరు రైలు ప్రయాణీకులు గుర్తు వచ్చారు. మధుసూదనం ఎలా ఉన్నాడో! వాడెప్పుడూ "దేవుడుంటే మనకేం? లేకపోతే మనకేం? ఎలా అనుకుంటే లాభసాటిగా ఉంటుందో అలా అనుకుంటే తీరిపోతుంది" అనే వాడు.

నాకు నిద్ర వస్తున్నట్టున్నది. కళ్లు మూతలు పడుతున్నాయి. కళ్లు మూసుకున్నా కనుచూపు మేర అంతటా మనోహరమైన రంగులు.......ఒత్తుగా తివాచీ పరిచినట్టున్న నేల.... ఎక్కడో పసి పాపల చిరునవ్వు.....అందమైన స్త్రీ కాలి గజ్జె కదలిన ధ్వని.....గుడిలో సంధ్య వేళ మ్రోగుతున్న గంటలు..... నీళ్లు నదిలో ఒడ్డును తాకుతున్న సవ్వడి.....హాయిగా ఎగిరి పోతున్న పక్షి రెక్కల ధ్వని.....జలార్ద్రమైన మేఘాలమధ్య మెరుపుతీగ.....ఆకాశంలో అందాల ఇంద్ర ధనుస్సు......వర్షం పడుతున్న సవ్వడి......వర్షంలో తడిసిన నేల వాసన....ఇప్పుడు నిద్రపోతే రేపు ఉదయం మెలకువ వస్తుంది అన్న భావన..... 'మరో ఇరవై నాలుగ్గంటలు' అనే డాక్టర్ కంఠస్వరం....

నాకు కళ్లు మూతలు పడ్డాయి.